SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS Traditional Cure For Toughest Diseases
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్



D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక



వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును

బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : బుధవారం 2 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 196

### నైపుణ్యాభివృద్ధి కాలేజీల ఏర్పాటుపై

# సీఎం జగన్ సమీక్ష



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** నైపుణ్యాభివృద్ధి కాలేజీల నిర్మాణం కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవనాల నిర్మాణం అత్యంత నాణ్యంగా ఉండాలని, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులనకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక నైపుణ్యాభివృద్ధి కళాశాల ఉండేలా మొత్తం రాష్ట్రంలో 30 కళాశాలల నిర్మాణం దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైపుణ్యాభివృద్ధి కళాశాలల ఏర్పాటు, తీసుకుంటున్న జాగ్రత్తలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఉత్తమ మానవ వనరులను పరిశ్రమలకు అందించడంలో, పారిశ్రామికాభివృద్ధి లో ఈ కాలేజీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీల్లో కోర్సులు, పాఠ్యప్రణాళిక తయారీపై సీఎం ఆరాతీశారు. కాలేజీల కోసం ఇప్పటివరకు దాదాపు 20 చోట్ల స్థలాల గుర్తించినట్లు సీఎం జగన్‌కు అధికారులు వెల్లడించారు. మిగిలిన చోట్ల కూడా చురుగ్గా స్థలాల ఎంపిక ప్రక్రియ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ వివిధ రకాల కోర్సులకు సంబంధించిన పాఠ్యప్రణాళికను సిద్ధంచేశామని పేర్కొన్నారు. ఫినిషింగ్ స్కిల్‌కోర్సులు, ప్రత్యామ్నాయ ఉపాధి కోర్సులు.. ఇలా రెండు రకాలుగా స్కిల్ కాలేజీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తం 162కి పైగా కోర్సుల ద్వారా ఈ కాలేజీల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు, ఇందులో 127 కోర్సులు ఫినిషింగ్ స్కిల్స్, 35 ప్రత్యామ్నాయ ఉపాధి కోర్సులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. పరిశ్రమల అవసరాలపై సర్వే చేసి దాని ప్రకారం కోర్సులను నిర్ణయించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారులు తెలిపారు. పాఠ్యప్రణాళిక తయారీలో 4 అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం తీసుకున్నామని, సింగపూర్ పాలిటెక్నిక్, జీఐజెడ్, వాన్ హల్ లారెన్‌స్టెన్ (యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్), డిపార్ట్ మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ భాగస్వామ్యాన్ని తీసుకున్నామని తెలిపారు. అలాగే మరో 23 ప్రఖ్యాత సంస్థల భాగస్వామ్యం, వారితో ఎంఓయూలకు సిద్ధమయ్యామని, మరో 35 సంస్థలతో చర్చలు నడుస్తున్నాయని అధికారులు వివరించారు. ల్యాబ్ ఏర్పాట్లు, పాఠ్యప్రణాళికలో వీరి సహకారం తీసుకుంటున్నామన్నారు. ఎంఓయూలకు సిద్ధమైన వాటిలో డెల్, హెచ్‌పీ, టీసీఎస్, ఐబీఎం, బియోకాన్, టాటా తదితర కంపెనీలు ఉన్నాయన్నారు. అలాగే వ్యవసాయంలో ఉపయోగించే యంత్రాల వినియోగం, వాటి మరమ్మతులపైనా శిక్షణ ఇవ్వాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఆర్థికశాఖ అధికారులతో కూర్చుని నిర్మాణానికి ప్రణాళిక సిద్ధంచేసుకుని పనులు త్వరగా మొదలుపెట్టాలని సూచించారు. హై ఎండ్‌స్కిల్స్‌తో పాటు ప్రతి కాలేజీలో కూడా ఏసీలు, ప్లంబింగ్, భవన నిర్మాణం తదితర పనులపైన యువతకు శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి సహా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంతరాము, స్పెషల్ సెక్రటరీ, మేనేజింగ్ డైరెక్టర్ అర్జా శ్రీకాంత్, ఏపీఎస్ఎస్‌డీసీ ఛైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి ఇతర అధికారులు హాజరయ్యారు.

## ఏక్ భారత్ శ్రేష్ట భారత్



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచన అని, పరస్పరం సంస్కృతి మార్పిడిని మెరుగుపరచు కోవడానికి రాష్ట్రాలు /కేంద్రపాలిత ప్రాంతాలను ఏకం చేసే వేదిక అని ఆంధ్రప్రదేశ్ రీనల్ ఔట్ రీచ్ బ్యూరో, అదనపు డైరెక్ట్ జనరల్ డి.మురళి మోహన్ అన్నారు. విశాఖపట్నంలో ఆర్ఓబి, విజయవాడ, ఆకాశవాణి వార్త విభాగం సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ వెబ్‌నార్‌లో ఆయన మాట్లాడుతూ, సాంస్కృతిక బంధాలు రాష్ట్రాల భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. గురుదావరా అధ్యక్షుడు దిల్బా సింగ్ ఆనంద్ మాట్లాడుతూ, వైవిధ్యంలో ఐక్యత మన దేశ అందం అని హర్షం వ్యక్తం చేశారు. వారి కుటుంబం గత యాభై సంవత్సరాలుగా విశాఖపట్నంలో స్థిరపడ్డామని, ప్రశాంతమైన ఈ నగరంలో ప్రజలు శాంతి కాముకలని కొనియాడారు. ప్రధానమంత్రి ఏక్ భారత్ ఆలోచన శ్రేష్ఠమైన భారత్‌కు దోహదం చేసిందని ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం రీసెర్చ్ ఫెలో ధనుర్ధాస్యం అన్నారు. ప్రధాని మోడి ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ దేశ ఐక్యతను ప్రపంచానికి చాటి చెపోతోందని ఆమె పేర్కొన్నారు. భారత దేశం ఈ గొప్ప ప్రయత్నం అనిర్వచనీయమని ఆమె అన్నారు. రీనల్ ఔట్ రీచ్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం. శ్రీనివాస్ మహేష్, నాయక్, క్షేత్ర ప్రచార అధికారులు తారకా ప్రసాద్, షఫీ, ఐ అండ్ బి అధికారులు వెబ్‌నార్‌లో పాల్గొన్నారు.



## పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీనుంచి వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

## దేశంలోనే తొలి అంబులెన్స్ డ్రైవర్‌గా 'ఆమె'!





**ఢిల్లీ:** మహిళలు అన్ని రంగాల్లోనూ అవకాశాలు అందిపుచ్చుకొని తమ సత్తాఏంటో నిరూపిస్తున్నారు. ఆకాశంలో సగం.. అంతటా మేం అంటూ వడివడిగా దూసుకెళ్తున్నారు. రాజకీయాలు, బ్యాంకింగ్, శాస్త్రసాంకేతిక రంగం, అంతరిక్షయానం.. ఇలా చెప్పుకొంటూ పోతే ఒకటేమిటి అన్ని రంగాల్లోనూ తమ నైపుణ్యాలు, సృజనాత్మకతను చాటుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తున్నారు. మారుతున్న కాలంలో మహిళలకు అన్నిరంగాల్లో అవకాశాలు కల్పించడం ద్వారా భారత్ లింగ సమానత్వం సాధించే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా తమిళనాడు ప్రభుత్వం మహిళా సాధికారతను మరింతగా ప్రోత్సహించేలా కీలక చర్యలు చేపట్టింది. దేశంలోనే తొలిసారి '108' అంబులెన్స్ డ్రైవర్‌గా ఓ మహిళను నియమించింది. కరోనాతో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రంలో వైద్య సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో తమిళనాడు సీఎం పళనిస్వామి రూ.125 కోట్లతో 500 కొత్త అంబులెన్స్‌లను కొనుగోలు చేయాలని గతంలో నిర్ణయించారు.

## విలేకరులు కావలెను

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

7032034001, 8500159006

## దేశంలో ఏపీది రెండో స్థానం



**ఢిల్లీ:** కరోనా కేసుల నమోదులో సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండో స్థానానికి చేరింది. ఇప్పటివరకూ ఆ స్థానంలో ఉన్న తమిళనాడును వెనక్కు నెట్టి ఆ స్థానాన్ని ఏపీ ఆక్రమించింది. మహారాష్ట్ర 7,80,689 కేసులతో తొలిస్థానంలో ఉంది. తాజాగా కేంద్ర వైద్యఆరోగ్యశాఖ వెల్లడించిన గణాంకాల మేరకు 1.40 లక్షల కేసులతో ఆగస్టులోకి ప్రవేశించిన ఆంధ్రప్రదేశ్ 31 వతేదీ సాయంత్రానికి 4,34,771 కేసులకి చేరింది. నెలరోజుల్లో రాష్ట్రంలో సుమారు 2.94లక్షల కేసులు పెరిగాయి. ఇదే సమయంలో తమిళనాడు 2.45 లక్షల నుంచి 4,28,041 కరోనా కేసులకు చేరింది. ఆగస్టు నెల తొలినాళ్ళలో తమిళనాడు కంటే 1.05 లక్షల మేర కేసులతో వెనుకబడి ఉన్న ఆంధ్రప్రదేశ్ నెల చివరి నాటికి దానికంటే (2,682 కేసులు) ఒక మెట్టు పైకి ఎదిగింది. మరణాల పరంగా మాత్రం తమిళనాడు రెండోస్థానంలో, కర్ణాటక మూడో స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కంటే తమిళనాడులో 86 శాతం కర్ణాటకలో 44% మరణాలు అధికంగా ఉండటమే ఇందుకు కారణం. మరోవైపు వరుసగా అయిదోరోజు దేశంలో 75వేలకుపైగా కేసులు సంభవించాయి. దీంతో తాజాగా మొత్తం కేసుల సంఖ్య 36.21 లక్షలకు చేరింది. ప్రపంచంలో రెండోస్థానంలో ఉన్న బ్రెజిల్ కంటే కేవలం 2.37 లక్షల దూరంలో భారత్ నిలిచింది. ప్రస్తుతం రోజువారీ కేసులు బ్రెజిల్ కంటే భారత్‌లో దాదాపు రెట్టింపు సంఖ్యలో నమోదవుతున్నందున ఈ వారాంతంలోపు భారత్ సంఖ్యాపరంగా రెండోస్థానానికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో ఇదివరకు ఎన్నడూలేనంత గరిష్ఠ సంఖ్యలో గత 24గంటల్లో కొవిడ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు లక్ష కేసులు ఉన్న జాబితాలో పది రాష్ట్రాలు ఉండగా, తాజాగా ఒడిశా అందులో చేరింది. మరో నాలుగురోజుల్లో గుజరాత్ కూడా ఈ జాబితాలో చేరవచ్చు. మొత్తం మీద పరిశీలిస్తే ఆగస్టులోనే 19.82 లక్షల కేసులొచ్చాయి. మొత్తం కేసుల్లో 55% కేవలం ఇదే నెలలో రావడం గమనార్హం. ఈనెలలో 28,722 మంది చనిపోయారు. అంటే మొత్తం మరణాల్లో 44.55% ఈనెలలోనే సంభవించాయి. అలాగే బాధితుల్లో 61.87% మంది ఆగస్టులోనే కోలుకొని ఇంటికెళ్లారు.

## ఏపీలో కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ ఉదయం 6 గంటల నుంచే వాలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. మధ్యాహ్నం 1 గంట నాటికి 37.47 లక్షల మందికి పింఛన్లు అందాయి. 2.68 లక్షల మంది వాలంటీర్లు లబ్ధిదారుల చేతికే పింఛన్లను అందిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 61.68లక్షల మంది లబ్ధిదారులు ఉండగా పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం 1,496.07 కోట్ల రూపాయలు విడుదల చేసింది. కొత్తగా 90,167 మందికి పింఛన్ల పంపిణీ జరిగింది. కొత్త పింఛన్‌దారుల కోసం 21.36 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. కరోనా నేపథ్యంలో బయోమెట్రిక్‌కు బదులు జియో ట్యాగింగ్ ఫొటోలతో పింఛన్లు అందిస్తున్నారు. కాగా, సంతృప్త స్థాయిలో అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెలాఖరు వరకు 8 నెలల వ్యవధిలో 11,42,877 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కావడం గమనార్హం.

## 14 నుంచి పార్లమెంట్ సమావేశాలు

**ఢిల్లీ:** సెప్టెంబర్ 14 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సమావేశాలు అక్టోబర్ 1తో ముగియనున్నాయి. కరోనా భయం వెంటాడుతున్న నేపథ్యంలో ఈ సమావేశాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉభయ సభల సభ్యులు కరోనా బారినపడకుండా అనేక ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ఉదయం 4 గంటల పాటు లోక్‌సభ, సాయంత్రం 4గంటల పాటు రాజ్యసభ కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈసారి ప్రశ్నోత్తరాల సమయం ఎత్తివేసే అవకాశం ఉండటంతో శూన్యగంటతో ప్రారంభిస్తారని సమాచారం. ఉభయ సభలూ ఒకేరోజు జరిగేలా ఏర్పాట్లు చేశారు. సభకు హాజరయ్యే ముందు ఎంపీలంతా విధిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇప్పటికే కోరిన విషయం తెలిసిందే. ఉభయ సభల్లోనూ పలు చోట్ల ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా దృశ్యమాధ్యమం ద్వారా పర్యవేక్షించారు.

## ప్రణబ్‌కు ప్రముఖుల నివాళి



**ఢిల్లీ:** అనారోగ్యంతో పోరాడు తూ తుదిశ్వాస విడిచిన మాజీ రాష్ట్ర పతి ప్రణబ్ ముఖర్జీకి ప్రముఖులు నివాళులర్పించారు. ఢిల్లీ 10 రాజాజీ మార్గ్‌లోని ప్రణబ్ నివాసంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి రాష్ట్ర పతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. అంతకుమందు రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్, త్రిదళాధిపతి జనరల్ బిపిన్ రావత్, త్రివిధ దళాధిపతు లు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ప్రణబ్‌కు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కేంద్ర మంత్రి హర్షవర్ధన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా, భాజపా జాతీయాధ్యక్షుడు జె.పి.నడ్డా, భాజపా నేత జ్యోతిరాధిత్య సింధియా, కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ సహా పలు పార్టీలకు చెందిన నాయకులు, ఇతర ప్రముఖులు ప్రణబ్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మరికొందరు ప్రముఖులు సైతం ప్రణబ్‌కు చివరిసారి వీడ్కోలు పలికేందుకు ఆయన నివాసానికి చేరుకుంటున్నారు. కరోనా నేపథ్యంలో భౌతిక దూరం వంటి జాగ్రత్తలు పాటించేలా అన్ని ఏర్పాట్లు చేశారు.

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది. ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావెలెను. యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.

bulusu555@gmail.com

మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు.

YouTube

## అత్యవసర అనుమతులపై సూచన!



**జెనీవా:** ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనావైరస్‌ను ఎదుర్కోవడం లో భాగంగా పలు దేశాలు చేపట్టిన వ్యాక్సిన్ ప్రయోగాలు తుది దశకు చేరుకుంటున్నాయి. ఇందులో భాగంగా ప్రజా వినియోగానికి ఆమోదం తెలిపేందుకు వేగవంతంగా అనుమతులు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. ఇలాంటి సమ యంలో నిరూపితం కాని వ్యాక్సిన్ వాడకంతో దుష్ప్రభావాలు కలిగే ఆస్కారం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. వ్యాక్సిన్ అత్యవసర వినియోగం కోసం త్వరలోనే ఆమోదం తెలుపుతామని అమెరికా ఎఫ్‌డీఏ పేర్కొన్న మరుసటి రోజే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సూచనలు చేయడం గమనార్హం. కరోనా వైరస్ వల్ల కలిగే ప్రమాదాల కంటే వ్యాక్సిన్ ప్రయో జనాలే ఎక్కువని అధికారులు ఒప్పించినంత కాలం ఈ అను మతుల ప్రక్రియ సాధారణం కంటే వేగవంతంగా కొనసాగు తుందని యూఎస్ ఎఫ్‌డీఏ చీఫ్ ఈ మధ్యే స్పష్టంచేశారు. దీన్ని విభేదిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపుణులు తాజాగా ప్రపంచదేశాలకు, వ్యాక్సిన్ తయారీ కంపెనీలకు సూచన చేశారు.వేగవంతంగా వ్యాక్సిన్ ఆమోదించడం వల్ల పలు ప్రమాదాలున్నాయని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ తాజాగా జరిగిన డబ్ల్యూహెచ్‌ఓ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేశారు. 'వీటిలో మొదటది.. ఇలాంటి క్లినికల్ ట్రయల్స్‌ను ముున్ముందు కొనసాగించడం కష్టమవు తుంది. రెండోది, తగినంత అధ్యయనం పూర్తికాని వ్యాక్సిన్ వల్ల అది పనిచేసే సామర్థ్యం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. దీంతో వైరస్‌ను పూర్తిగా అంతంచేయకపోగా తీవ్రత పెరగడానికి కారణమవుతుంది' అని సౌమ్య స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. మూడో దశ క్లినికల్ ట్రయల్స్ నుంచి వచ్చిన పూర్తి డేటా ఆధారంగానే వ్యాక్సిన్‌కు ఆమోదం తెలపాలని ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా నిపుణులు పిలుపునిచ్చారు. ఇలాంటి సమయాల్లో వ్యాక్సిన్ అత్యవసర వినియో గానికి అనుమతులు ఇచ్చే క్రమంలో దేశాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని డబ్ల్యూహెచ్‌ఓ నిపుణులు సూచిస్తున్నారు.

## క్షమించండి.. నేనప్పుడు 'అలా' లేను!

### రిషీకేశ్ ఉదంతంపై ఫ్రెంచి మహిళ స్పందన



**రిషీకేశ్:** ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ హిందువుల పుణ్యక్షేత్రం రిషీకేశ్‌లో అభ్యంతరకరంగా ప్రవర్తించారనే ఆరోపణలపై ఫ్రెంచి మహిళ మేరీ హెలెన్ గురువారం అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. భారతీయుల మనోభావాలను గాయపరిచి ఉంటే క్షమించాలని ఆమె కోరారు.. అయితే ఆ సమయంలో తాను నగ్నంగా లేనని స్పష్టం చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యా చారాలను గురించి సమాజంలో అవగాహన తీసుకొచ్చే ఉద్దేశంతో తాను ఈ విధంగా చేశానని హెలెన్ వివరించారు. ఇక్కడ గంగానదిపై ఉన్న సుమారు వంద సంవత్సరాల నాటి వంతెన లక్ష్మణ్ ఝూలాపై నగ్నంగా వీడియోలు తీసి, వాటిని సామాజిక మాధ్యమాల్లో ఉంచినందుకు.. ఇంటర్నెట్ చట్టాల ప్రకారం 27 ఏళ్ల ఈ యువతిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అయితే తాను ఈ వీడియో తీస్తుండగా చుట్టుపక్కల ఎవరూ లేరని.. దేశంలో లైంగిక దాడులను గురించి అవగాహన తీసుకొచ్చేందుకు మాత్రమే ఈ విధంగా చేశానని మేరీ హెలెన్ అంటున్నారు. కాగా, తను పూసలతో చేసిన గొలుసులు అమ్ముతానని, తన వ్యాపారానికి ప్రచారం కోసమే ఈ విధంగా చేశానని ఆ ఫ్రెంచి మహిళ తొలుత అంగీకరించినట్టు పోలీసులు చెబుతున్నారు. విచారణ కోసం ఫ్రెంచి యువతి మొబైల్‌ను స్వాధీనం చేసుకుని... అనంతరం ఆమెను బెయిల్‌పై విడుదల చేసినట్టు వారు వివరించారు.

## డ్రైవింగ్ లైసెన్స్‌ల అనుమతుల పొడిగింపు



**దిల్లీ:** దేశంలో మోటారు వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సు తదితర అనుమతి పత్రాల చెల్లుబాటు తేదీని కేంద్ర ప్రభుత్వం మరోమారు పొడిగించింది. వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సు, వాహన బీమా, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ తదితర వివిధ పత్రాల చెల్లుబాటు తేదీని రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ డిసెంబర్ 31 వరకు పొడిగించింది. అయితే ఈ వెసులుబాటు ఈ సంవత్సరం ఫిబ్రవరి 1 తరువాత లేదా డిసెంబర్ 31 లోగా గడువు ముగియనున్న పత్రాలకు మాత్రమే వర్తిస్తుందని వివరించింది. కాగా, కరోనా లాక్‌డౌన్ కారణంగా ఈ విధంగా వాహన పత్రాల గడువు పొడిగించటం ఇది మూడోసారి. "కొవిడ్-19 లాక్‌డౌన్ కారణంగా ప్రభావితమైన ప్రస్తుత పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటూ.. పైన చెప్పిన అన్ని ధ్రువపత్రాల చెల్లుబాటు తేదీని పొడిగించాము. ఫిబ్రవరి 2020 అనంతరం లేదా డిసెంబరు 31 లోగా గడువు ముగిసిపోయే వాహన సంబంధ ధ్రువపత్రాలన్నీ చెల్లుబాటు అవుతాయి. ఆయా ధ్రువపత్రాలను 31 డిసెంబర్ వరకు పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి." అని అధికారిక ప్రకటన తెలియచేసింది.

# 'తుది ఆమోదానికి చేరువలో ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్'



వాషింగ్టన్: కొవిడ్-19 కట్టడి కోసం ఆక్స్‌ఫర్డ్‌తో కలిసి ఆస్ట్రాజెనెకా కంపెనీ అభివృద్ధి చేస్తున్న వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్ అమెరికాలో మూడో దశకు చేరుకున్నాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రజా వినియోగానికి తుది ఆమోదం పొందడానికి అతి దగ్గరలో ఉందని ప్రకటించారు. "అమెరికాలో ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్ మూడో దశకు చేరుకున్నాయని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. ఇప్పటికే ఆఖరి దశకు చేరుకున్న టీకాల సరసన ఇది కూడా చేరింది. అసాధ్యం అనుకున్న పనుల్ని అమెరికాలో మేం చేసి చూపిస్తున్నాం" అని సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ అన్నారు. మరోవైపు ఆస్ట్రాజెనెకా సైతం దీనిపై స్పందించింది. "అమెరికా వ్యాప్తంగా 80 నగరాల్లో వివిధ ప్రయోగ కేంద్రాలు 30 వేల మంది వాలంటీర్లను నమోదుచేసుకున్నాయి. వీరంతో 18 ఏళ్ల పైబడినవారే. అలాగే వివిధ సంస్కృతులు, జాతులు, భౌగోళిక ప్రాంతాలకు చెందిన వారు వీరిలో ఉన్నారు. హెచ్‌ఐవీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా ఇందులో ఉన్నారు. కరోనా సోకే ప్రమాదం ఉన్న వారిని కూడా ఇందులో చేర్చాం" అని ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 2021 కల్లా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అమెరికా ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. 300 మిలియన్ల సురక్షితమైన కరోనా వ్యాక్సిన్ డోసులను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా తాజా ప్రయోగాల్ని జరుపుతోంది. ఆస్ట్రాజెనెకాతో పాటు మోడెర్నా, ఫైజర్ కంపెనీలు అభివృద్ధి చేస్తున్న వ్యాక్సిన్లు సైతం ప్రస్తుతం మూడో దశలో ఉన్నాయి.

## 'మారటోరియం రెండేళ్ల వరకు పొడిగించొచ్చు'



**దిల్లీ:** మారటోరియం సమయం లో వడ్డీ మాఫీ పిటిషన్‌పై నేడు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. వివిధ రుణాలపై మారటోరియం రెండేళ్ల వరకు పొడిగించే అవకాశం ఉందని కేంద్రం సర్వోన్నత న్యాయస్థానికి తెలియజేసింది. మారటోరియం వ్యవధిలో వడ్డీని పరిగణించే అవకాశం ఉందని పేర్కొంది. దీనిపై స్పందించిన కోర్టు న్యాయంగా ఆలోచించాలని కేంద్రానికి హితవు పలికింది. ఈ విచారణపై ఎక్కువ ఆలస్యం చేయదలచుకోలేదన్న జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణను బుధవారానికి వాయిదా వేసింది. దీనిపై రేపు పూర్తి స్థాయిలో వాదనలు వింటామని తెలిపింది.కేంద్రం తరఫున వాదనలు వినిపించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. మహమ్మారి వల్ల తలెత్తిన ఆర్థిక సమస్యల్ని పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని తెలిపారు. వైరస్ కట్టడి కోసం తీసుకున్న కఠిన చర్యల వల్ల దేశ వృద్ధి రేటు 23 శాతం కుంగిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.కరోనాతో ఆదాయాలు తగ్గిన వారికి ఉపశమనం కల్గించేందుకు ఆర్బీఐ మారటోరియం వసతి కల్పించిన విషయం తెలిసిందే. అయితే ఆ వ్యవధిలో రుణాలపై వడ్డీ వసూలు చేయడం, ఆ వడ్డీపై వడ్డీ విధించడం వల్ల లాభమేమీ ఉండదని పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మారటోరియం వల్ల రుణాలు చెల్లించే కాలపరిమితి మాత్రమే పెరుగుతుందని, వడ్డీ మాత్రం చెల్లించాల్సిందేనని గతంలో ఆర్బీఐ స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వైఖరి కూడా తెలపాలని ఆగస్టు 26న సుప్రీంకోర్టు ఆదేశించింది.

# ఒక్క ఆగస్టులోనే 20లక్షల కేసులు..!



**దిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ మహమ్మారి అంతకంతకూ పెరుగుతోంది. ప్రతినెల రెట్టింపుస్థాయిలో పాజిటివ్ కేసులు బయటపడుతున్నాయి. కేవలం ఆగస్టు నెలలోనే దేశవ్యాప్తంగా దాదాపు 20లక్షల కేసులు నమోదయ్యాయి. ఒకే నెల వ్యవధిలో ఇన్ని కేసులు ప్రపంచంలో ఏ దేశంలోనూ నమోదుకాలేదు. అత్యధిక వైరస్ తీవ్రత ఉన్న అమెరికాలోనూ జులై నెలలో అత్యధికంగా 19లక్షల 4వేల కేసులు మాత్రమే నమోదయ్యాయి. భారత్‌లో ఆగస్టు నెలలోనే రికార్డుస్థాయిలో 19లక్షల 50వేల కేసులు బయటపడ్డాయి. మరణాలు మాత్రం అమెరికా, బ్రెజిల్ దేశాల్లో ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఆగస్టు నెలలో అమెరికాలో 31వేల కొవిడ్ మరణాలు నమోదుకాగా బ్రెజిల్‌లో దాదాపు 30వేల మరణాలు చోటుచేసుకున్నాయి. భారత్‌లో ఈ సంఖ్య దాదాపు 28వేలుగా ఉంది.భారత్‌లో నిత్యం 70వేలకు పైగా కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే. గడిచిన 24గంటల్లో మరో 69,921 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. గత నాలుగురోజులతో పోల్చితే కేసుల సంఖ్య కాస్త తగ్గింది. దీంతో మంగళవారంనాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 36లక్షల 91వేలకు చేరింది. వీరిలో ఇప్పటికే 28లక్షల 39వేల మంది కోలుకోగా మరో 7లక్షల 85వేల యాక్టివ్ కేసులు ఉన్నాయి. నిన్న మరో 65వేల మంది బాధితులు వైరస్ నుంచి కోలుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 76శాతం దాటింది. గడిచిన ఆరు రోజుల తర్వాత మరణాల సంఖ్య కూడా కాస్త తగ్గింది. నిన్న దేశవ్యాప్తంగా 819 మంది కరోనా రోగులు ప్రాణాలు కోల్పోయారు . దీంతో మంగళవారం నాటికి దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య 65,288కు చేరినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో కరోనా మరణాల రేటు 1.7శాతంగా కొనసాగుతోంది.

## ఆ మూడు రోజులూ.. బెంగాల్ పూర్తి లాక్‌డౌన్



**కోల్‌కతా:** కరోనా కేసులు రోజురోజుకీ పెరిగిపోతున్న వేళ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కంటైన్‌మెంట్ జోన్‌లలో సెప్టెంబర్ 30 వరకు లాక్‌డౌన్ పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే, ఈ వైరస్‌కు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా సెప్టెంబర్ 7, 11, 12 తేదీల్లో బెంగాల్ వ్యాప్తంగా పూర్తిస్థాయి లాక్‌డౌన్ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ సిన్హా వెల్లడించారు. స్థానికంగా లాక్‌డౌన్‌లు పెట్టకూడ దంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై సీఎస్ స్పందిస్తూ.. పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించే తేదీలను కేంద్రం అన్‌లాక్-4 మార్గదర్శకాలను ప్రకటించకముందే తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మెట్రో సర్వీసులను గ్రేడ్‌ల వారీగా సెప్టెంబర్ 8 నుంచి పునరుద్ధరించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు, సినిమా థియేటర్లు, స్విమ్మింగ్ పూల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ పార్కులు మాత్రం మూసే ఉంచుతామని స్పష్టంచేశారు. కంటైన్‌మెంట్ జోన్‌లు కాని ప్రాంతాల్లో ఓపెన్ ఎయిర్ థియేటర్లు సెప్టెంబర్ 21 నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. బెంగాల్‌లో నిన్న ఒక్కరోజే 3019 కొత్త కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1,59,785 మందికి కరోనా సోకగా. వారిలో 1,30,952 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారు. మరో 3,176మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 25,657 యాక్టివ్ కేసులు ఉన్నాయి. బెంగాల్‌లో రికవరీ రేటు 82శాతం కాగా.. మరణాల రేటు 2శాతంగా ఉంది.

# కారు బీభత్సం: నలుగురు మృతి

### ప్రమాదం జరిగిన ప్రదేశం 'కేఫ్ జనతా'





**ముంబై :** నగరంలో కారు బీభత్సం సృష్టించింది. ఫుట్‌పాత్‌పై ఉన్న జనంపైకి దూసుకెళ్లటంతో నలుగురు మృత్యువాతపడగా మరి కొంతమంది గాయాలపాలయ్యారు. ఈ సంఘటన ముంబైలోని క్రాఫోర్డ్ మార్కెట్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివవారల మేరకు.. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో కొలంబో జంక్షన్‌లోని కేఫ్ జనతా వద్ద గల ఫుట్‌పాత్‌పై ఉన్న 12 మందిపైకి కారు అదుపుతప్పి దూసుకువచ్చింది. కారు వేగంగా వారిని ఢీకొట్టడంతో నలుగురు గాల్లోకి ఎగిరారు. వారిలో ఓ వ్యక్తి కారుపై పడి అక్కడికక్కడే ప్రాణాలు విడవగా మరికొందరు రెస్టారెంట్‌లోకి ఎగిరిపడి మరణించారు. ఈ ఘటనలో కారు డ్రైవర్ సమీర్ ఇబ్రహీంకు కూడా గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు 60 ఏళ్లు పైబడిన మహిళలు ఉండటం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం జరిగినపుడు సమీర్ తాగున్నాడా? లేదా? అ?న్నది తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు.

# ప్రణబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారు: అమెరికా



**దిల్లీ:** భరతమాత ముద్దుబిడ్డ, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణం పట్ల అగ్రరాజ్యం అమెరికా సహా ప్రపంచ దేశాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. భారతదేశ చరిత్ర పుటల్లో ఆయన ఎప్పటికీ నిలిచిపోతారంటూ అమెరికా విదేశాంగశాఖ సంతాపం ప్రకటించింది. "మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణం పట్ల మేం సంతాపం తెలయజేస్తున్నాం. ఓ గొప్ప నేతను కోల్పోయిన భారత ప్రజలకు ఈ సమయంలో మేము సంఘీభావంగా నిలుస్తున్నాం. ఆయన భారత చరిత్ర పుటల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోతారు" అంటూ అమెరికా విదేశాంగ శాఖ తన సంతాప సందేశాన్ని తెలియజేసింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ సైతం ముఖర్జీ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఇరు దేశాల మధ్య సంబంధాల్ని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. 'మేం ఓ గొప్ప నేస్తాన్ని కోల్పోయాం. వివిధ హోదాల్లో భారత్-నేపాల్ సంబంధాల్ని బలోపేతం చేయడంలో ప్రణబ్ ముఖర్జీ విశేష కృషి చేశారు. ఈ కష్ట సమయంలో భారత ప్రజలకు మేం మా సంతపాన్ని తెలియజేస్తున్నాం.' 'ముఖర్జీ గొప్ప రాజనీతిజ్ఞుడు. అందరి మన్ననల్ని పొందిన ఓ గొప్ప రచయిత. ఎంతో నిబద్ధతతో దేశానికి ఆయన చేసిన సేవ నిరుపమానమైంది. ఆయన కుటుంబానికి, ఆప్తులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.'

# అలాచేస్తే ప్రమాదాన్ని ఆహ్వానించినట్టే



**జెనీవా:** సరైన నియంత్రణ లేకుండా కొవిడ్-19 అన్‌లాక్ ప్రక్రియను చేపట్టడం.. ప్రమాదాన్ని కోరి ఆహ్వానించడమే అని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ హెచ్చరించారు. అన్‌లాక్ సమయంలో కూడా కరోనా వైరస్ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఆయన ప్రపంచ దేశాలకు స్పష్టం చేశారు. గత ఎనిమిది నెలలుగా అమలులో ఉన్న కరోనా ఆంక్షల వల్ల అధిక శాతం ప్రజలు ఇబ్బందులకు గురైనట్లు తాము గమనించామన్నారు. వారు సాదారణ జీవనం గడిపేందుకు ఆతృతతో ఎదురుచూస్తున్నారని డైరక్టర్ జనరల్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాల సామాజిక, ఆర్థిక వ్యవస్థలు తిరిగి యథాతథ స్థితికి వచ్చేందుకు తాము కూడా మద్దతిస్తామని ఆయన హామీ ఇచ్చారు."చిన్నారులు పాఠశాలలకు, ప్రజలు పని ప్రదేశాలకు వెళ్లే దృశ్యాన్ని చూడాలని మేమూ కోరుకుంటున్నాం.. అయితే ఈ ప్రక్రియ సురక్షితంగా ఉండాలనుకుంటున్నాం" అని టెడ్రోస్ ఓ సమావేశంలో వెల్లడించారు. కొవిడ్ మహమ్మారి అంతరించినట్టు ఏ దేశం నటించలేదని అయన మరోసారి హెచ్చరించారు. కరోనా వైరస్ అతి సులభంగా వ్యాపిస్తుందనేది అందరూ గ్రహించాల్సిన నిజమని... దానిని దృష్టిలో ఉంచుకోకుండా అన్‌లాక్ ప్రక్రియ చేపట్టడం ఆపదలకు ఆహ్వానం పలికినట్టే అని ఆయన హెచ్చరించారు. భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడే మైదానాలు, ప్రార్థనా స్థలాలు, క్లబ్‌లు తదితర ప్రదేశాలు కరోనా విస్తృతంగా వ్యాప్తించేందుకు కారణమౌతాయని ఆయన వివరించారు. అన్‌లాక్ నిర్ణయం తీసుకొనేందుకు.. స్థానిక అంశాలు, ప్రమాద అవకాశాలను పరిగణనలోకి తీసుకొని చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ప్రపంచ దేశాలకు సూచించారు.

## సరిహద్దుల్లో ఉద్రిక్తత: చైనా మంత్రి కీలక వ్యాఖ్యలు




**బీజింగ్:** భారత్- చైనా సరిహద్దుల్లో నెలకొన్న తాజా ఉద్రిక్తతలు ఘర్షణలకు దారి తీయకుండా ఇరు దేశాలు సంయమనం పాటించాల్సిన ఆవశ్యకత ఉందని డ్రాగన్ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యీ అన్నారు. సినో- ఇండియా బార్డర్‌లో తామెప్పుడూ సుస్థిరతకే ప్రాధాన్యం ఇస్తామని, ఎన్నడూ కవ్వింపు చర్యలకు పాల్పడలేదని పేర్కొన్నారు. భారత్‌తో సామరస్యపూర్వక చర్చలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. "ఇటీవల కాలంలో చైనా- భారత్ సంబంధాలపై అన్ని వర్గాలకు ఆసక్తి పెరిగింది. నేను ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. పరిస్థితులు చేయి దాటిపోయేలా చైనా ఎన్నడూ ముందడుగు వేయలేదు. సరిహద్దుల్లో సుస్థిరత నెలకొల్పాలనే నిబద్ధతతో ఉంది. అయితే మా సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం. రక్షణ కవచంలా నిలబడతాం. ఇంకొక విషయం ఏమిటంటే.. చైనా- భారత్ మధ్య సరిహద్దులు నిర్ణయించబడలేదు. కాబట్టి ఇలాంటి సమస్యలు తలెత్తడం సహజం. అయితే వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఉద్రిక్తతలు ఘర్షణలుగా మారేందుకు అవకాశం ఇవ్వకూడదు. అదే ఇరు దేశాలకు శ్రేయస్కరం. డ్రాగన్(చైనా), ఎలిఫెంట్(ఇండియా) తలపడితే 1ంT2 అవుతుంది. అదే అవి రెండూ కలిసి డ్యాన్స్ చేస్తే 1ంT11 అవుతుంది. మరో ఉదాహరణ చెబుతాను. విభేదాలు పక్కనబెట్టి ఇరు దేశాధినేతలు పరస్పర ప్రయోజనాల గురించి ఆలోచిస్తే 2.7 బిలియన్ మంది ప్రజలు కలిసికట్టుగా ముందుకు సాగుతారు. ఇరు దేశాలు అభివృద్ధి చెందడంతో పాటుగా సత్సంబంధాల కారణంగా మరెన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. భారత్‌తో బంధం బలోపేతం చేసుకోవడానికి చైనా సిద్ధంగా ఉంది" అని వాంగ్ యీ వ్యాఖ్యానించినట్లు చైనా విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది. ప్యారిస్‌లోని ప్రఖ్యాత ఫ్రెంచి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో సోమవారం ప్రసంగించిన ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేసినట్లు వెల్లడించింది. కాగా తూర్పు లదాఖ్, పాంగాంగ్ సో సరస్సు వద్ద చైనా ఆర్మీ బలగాల ఉపసంహరణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపు చర్యలకు పాల్పడిందని భారత్ ప్రకటన విడుదల చేసిన కొద్దిసేపటికే వాంగ్ యీ ఈ మేరకు స్పందించడం గమనార్హం.




## విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ వార్తలు

### ప్రణబ్ ముఖర్జీ మరణం బాధాకరం : ఆమ్‌ఆద్మీ



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ప్రణబ్ ముఖర్జీ మరణం బాధాకరమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె. దయానంద్ అన్నారు. మంగళవారం నాడు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఐదు దశాబ్దాలుగా భారత రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ప్రణబ్ ముఖర్జీ కేంద్ర మంత్రి వర్గంలో ఆర్థిక, రక్షణ, విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం వంటి కీలక శాఖలకు మంత్రిగా సేవలందించారని కొనియాడారు. భారత రాష్ట్రపతిగానూ తనదైన ముద్రను వేశారని అన్నారు. ప్రొఫెసర్‌గా, జర్నలిస్ట్‌గా, రచయితగా, ఆర్థికవేత్తగా పార్టీల కతీతంగా ఆయన చేసిన సేవ మహోన్నతమని అన్నారు. వారి మరణానికి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామని అన్నారు.

## 2న రక్తదాన శిబిరం

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** జనసేన పార్టీ మరియు విజయనగరం జిల్లా చిరంజీవి యువత సంయుక్త ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కలక్టరేట్, గణేష్ కోవెల ప్రక్కనున్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు,జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు(బాలు) పత్రికాప్రకటన ద్వారా తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, మెగాఫ్యామిలీ అభిమానులు, యువతీ యువకులు విచ్చేసి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అక్రమ సారా నిర్మూలించండి

### మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ డిమాండ్

**పిఠాపురం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** పిఠాపురం మండలం జల్లూరు గ్రామములో మద్యం (సారా)అమ్మకాలను వెంటనే అరికట్టాలని కోరుతూ మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ,ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ కార్మిక సంఘం,ఆధ్వర్యంలో జల్లూరు సచివాలయ అధికా రులకు ఎం.తమ్మారావు, శేషగిరిరావు లకు వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్య నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం (సారా) అమ్మకాలు విచ్చలవిడిగా జరుగు తున్నాయని అన్నారు. మల్లం గ్రామంలో సారాను హరికట్టాలని సచివాలయం వద్ద ఆందోళన చేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి. ఈ సమస్యను పరిష్కరించాలని లేకుంటే గ్రామాల్లో మహిళలతో ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు కరణ్ రాజ్, కరణం విశ్వనాథం,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరకుల సింహాచలం పాల్గొన్నారు.

## కడియం మాజీ ఎమ్మెల్యే పాటంశెట్టి అమ్మిరాజు మృతి

**కడియం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** కడియం నియోజకవర్గం నుంచి 1978 లో జనతా పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందిన కడియపులంక గ్రామానికి చెందిన పాటంశెట్టి అమ్మిరాజు(86) అనారోగ్యంతో మృతి చెందారు. కేవలం రూ.62 వేల రూపాయలు ప్రజల విరాళాలతో ఎన్నికలలో ఖర్చు పెట్టి గెలిచారు. అదికూడా ఓటమి ఎరుగని మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు పైన. 1972 లో అప్పుడు డిగ్రీ చదివిన కుర్రాడు కావడంతో కడియపులంక సర్పంచిగా గెలిపించారు. ఆ సమయంలోనే ఎస్సీ నియోజకవర్గంగా ఉన్న కడియంలో లెక్కల సేకరించి జనరల్ స్థానంగా మార్చాలని కేంద్రం ఎన్నికల కమిషన్ కు లేఖలు ద్వారా సమాచారం ఇచ్చారు. ఆ పిర్యాదు మేరకు విచారణ జరిపి ఈ నియోజకవర్గాన్ని 1978లో జనరల్ స్థానంగా మార్చారు. సర్పంచిగా ఉంటూ జనతాపార్టీ అధినాయకులకు టిక్కెట్ కోసం పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. విచిత్రం ఏంటంటే పేపర్లో చూసుకునే వరకూ టిక్కెట్ వచ్చిన సంగతి ఆయనకు తెలియదు. దాతల సహకారంతో ఈయన విజయం సాధించారు. అయితే 1980లో అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి పట్టుపట్టడంతో నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు. కడియపులంక ప్రాంతంలో తొలిసారిగా తారు రోడ్లు అమ్మిరాజు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే వేసారు. అలాగే రాష్ట్ర ఆర్టీసీ జోనల్ సభ్యులు గాను మూడేళ్ళ పాటు ఈయన పనిచేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అమ్మిరాజు మృతికి రాష్ట్ర కాపు కార్పోరేషన్ చైర్మన్ జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం ఎంపి మార్గాని భరత్ రామ్, రూరల్ ఎమ్మెల్యే గోరింట్ల బుచ్చయ్య చౌదరి,మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, మాజీ ఎంపి గిరజాల వెంకటస్వామి నాయుడు, రూరల్ వైకాపా కో ఆర్డినేటర్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర కార్యదర్శిలు గిరజాల బాబు, రావిపాటి రామచంద్రరావు, టిడిపి నాయకులు గంగుమళ్ళ సత్యనారాయణ, మార్గాని సత్య నారాయణ, వెలుగు బంటి సత్యప్రసాద్, నర్సరీ సంఘం అధ్యక్షులు పుల్లా సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

## రానున్న నెలన్నర రోజులు కీలకం



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** జిల్లాలో కోవిడ్ దృష్ట్యా రానున్న నెలన్నర రోజులు అతి కీలకమని భావిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె నివాస్ అన్నారు. మంగళవారం నగరంలో కంటెంట్మెంట్ జోన్లలో పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ నివాస్ పర్యటించారు. హాయతినగర్, ఫోజుల్ బేగ్ పేట, హడ్కో కాలనీ, చల్లవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్లు చేపడుతున్న సర్వే లను పరిశీలించారు. సర్వేలో చేపట్టవలసిన అంశాలను గూర్చి ప్రశ్నించారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ప్రతి రోజు శ్రీకాకుళం నగరంలో రెండు వందల నుండి 250 కేసులో వస్తున్నాయని అన్నారు. జిల్లాలో గత రెండు రోజులు రోజుకు వెయ్యి కేసులు నమోదు అయ్యాయన్నారు. 25 రోజుల్లో కేసుల సంఖ్య రెట్టింపు కాగలదని భావిస్తున్నామని, ఈ తరుణంలో రానున్న ఒకటిన్నర నెలలు అతి కీలకంగా భావిస్తూ అందుకు తగిన చర్యలు చేపడుతున్నామని అన్నారు. కాంటైన్మెంట్ జోన్లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు తిరగవద్దని కోరారు. మొబైల్ వాన్ల ద్వారా కూరగాయలు, తాగునీరు వంటి సౌకర్యాలు అందించే చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. లాక్ డౌన్ సడలింపు తరువాత జిల్లాలో కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని అన్నారు. ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్య దృష్ట్యా హోమ్ ఐసోలేషన్ కు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. వైరస్ నివారణ లో భాగంగా స్లమ్ ప్రాంతాల్లో 20 వేల మందికి ఫేస్ షీల్డ్ లను పంపిణీ చేయుటకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వాలంటీర్లు అందరికీ ఫేస్ షీల్డ్ లు పంపిణీ చేశామని ఆయన అన్నారు. పరీక్షలు పెంచడానికి చర్యలు చేపట్టామని, శ్రీకాకుళంలో రోజుకు 9 వందల వరకు రాపిడ్ టెస్టులు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 24 గంటల్లో ఫలితాలు వెల్లడికి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రజలు అనవసరంగా బయటకు తిరగవద్దని కోరారు. కరోనా లక్షణాలు కనిపించగానే తెలియజేయాలని, త్వరగా రావడం వలన ప్రాణాపాయ స్థితి ఉండదని గ్రహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలో 144 సెక్షన్ విధించారు జరిగిందని, నలుగురు కంటే ఎక్కువ మంది ఎక్కడా ఉండరాదని చెప్పారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట, మెలియాపుట్టి, పొందూరు, రాజాం ప్రాంతాల్లో కేసులు అధికంగా నమోదవుతున్నట్లు చెప్పారు. యువత ఒకే చోట గుమిగూడుతున్నారని, ఇది వైరస్ వ్యాప్తికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఇంట్లో పెద్ద వయసు వారికి ప్రమాదమని యువత గ్రహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లో నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, రెవిన్యూ డివిజనల్ అధికారి ఈట్ల కిషోర్, పట్టణ పర్యవేక్షణ అధికారి టి.వేణుగోపాల్, ప్రత్యేక అధికారులు టి వివి ప్రసాద్, ప్రసాద్, తాహసిల్దార్ వై వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్ వాచ్‌మేన్ అనుమానాస్పద మృతి




**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** విజయనగరం పట్టణం బాబా మెట్ట నల్ల చెరువు వద్ద నిర్మాణం లో ఉన్న 33 కేవీ సబ్ స్టేషన్‌లో చింతాడ బాబ్జి(45) అనే దళిత యువకుడు ఫ్యాన్‌కి ఉరి వేయబడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన పై టు టౌన్ పోలీస్ అధికారులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాబామెట్ట ఖాదర్ నగర్ హరిజన వీధిలో నివాసం ఉంటున్న చింతాడ బాబ్జి నల్ల చెరువులో కొత్తగా నిర్మాణం అవుతున్న 33 కేవీ సబ్ స్టేషన్ లో గత మూడేళ్లు గా వాచ్ మేన్ గా పని చేస్తున్నాడు. ఇతడికి, భార్య హీరా, ఇద్దరు కుమారులు ఉన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణం ను విజయవాడ కు చెందిన ఒక ప్రయివేటు వ్యక్తి చేపడుతున్నారు. ఇక్కడ సందీప్ అనే వ్యక్తి సూపర్ వైజర్‌గా పనులను పర్యవేక్షణ చేస్తున్నారు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి కావొస్తున్న క్రమంలో దాన్ని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ విభాగానికి అప్పగించడానికి సిద్ధంగా ఉన్న సదరు కాంట్రాక్ట్ సంస్థ ఇక్కడ వాచ్ మేన్‌గా పని చేస్తున్న బాబ్జిని విధుల నుంచి తప్పించే ఆలోచన చేసింది. వాచ్ మేన్ విధుల నుంచి తొలిగించనున్నట్టు కొద్దీ రోజుల క్రితమే సూపర్ వైజర్ సందీప్, బాబ్జికి తెలియ చేసి ఉన్నాడు. అంతేకాకుండా జీతం కూడా నిలిపివేశారు. అయినప్పటికీ బాబ్జి ని విధులకు వినియోగించు కుంటూనే ఉన్నారు. ఒక వైపు తొలిగిస్తామని చెబుతూ, మరో వైపు జీతం నిలిపివేయడం చేస్తూనే, బాబ్జి కే కేంద్రం తాళాలు కూడా అప్పగించి ఆయన్నే కాపలాగా ఉంచారు.

## సిపిఎస్ రద్దు చేయాల్సిందే




**కొత్తవలస, వార్తావళి, సెప్టెంబర్ 1 :** సిపిఎస్ రద్దు- మాట మరవద్దు అన్న డిమాండ్‌తో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో మంగళవారం మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, సిపిఎస్ రద్దు- ఓపీఎస్ ముద్దు, సిపిఎస్ రద్దు- మాట మరవొద్దు వంటి నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వివిఎస్ ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్రంలో 1.80 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగుల కుటుంబాలకు సాంఘిక భద్రత కల్పించాలన్నారు. సిపిఎస్ రద్దుపై అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన వర్కింగ్ కమిటీ మార్చి 30వ తేదీకి ముగియడంతో, ప్రభుత్వం నివేదిక తెప్పించి అమలు పరచాలని కోరారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్.వి.యుగంధర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్రంలో వేలాది ఉద్యోగులు ఆతృతతో ఎదురుచూస్తున్నార న్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ సమస్యగా వున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం తక్షణం రద్దు చేయాలని కోరారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో చాలా ప్రాంతాల్లో, చాలా సభల్లో సిపిఎస్ రద్దు చేస్తామన్న ముఖ్యమంత్రి జగన్ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట్ల మూర్తినాయుడు, సలహాదారు ప్రభాకరరావు, సహాయ కార్యదర్శి కంది లక్ష్మణరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బాలభాస్కరరావు, సతీష్ , పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు రామచంద్ర పండా,అగ్రికల్చరల్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్నాధరావు, పట్టణ కమిటీ ప్రతినిధులు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. పలు ఉద్యోగ సంఘాలు మేలుకొలుపు కార్యక్రమానికి మద్దతు ప్రకటించాయి. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు.

## రైతు భరోసాపై ప్రత్యేక టెలిస్పందన



**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పథకంతో చేపడుతున్న కార్యక్రమాలు ప్రతి రైతుకి అందించాలి అని ప్రాజెక్ట్ అధికారి పేర్కొన్నారు, అందు నిమిత్తం సెప్టెంబర్ 3 ,గురువారం ఐ.టి.డి.ఏ గిరిమిత్ర సమావేశమందిరంలో ఫోన్ ద్వారా రైతు భరోసా సమస్యలపైన వినతులు స్వీకరణ చేపడుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారి అర్.కూర్మనాథ్ తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటల నుండి 11.30 వరకు ఫోన్ ద్వారా వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. రైతులు తమ రైతు భరోసాకు సంబంధించిన వినతులు తెలియజేయాలన్నారు. వినతులు తెలియజేయాడానికి ఐ.టి.డి.ఏ కార్యాలయం లాండ్ ఫోన్ నెంబర్ 08963-220044కి ఫోన్ చేసి తెలుపవచ్చు అన్నారు.

## కరోనా వారియర్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన జిల్లా ఎస్పీ



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** విజయనగరం జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న బి. రాజకుమారి, ఐపిఎస్‌కు కోవిడ్ 19 సమయంలో ప్రజలకు విస్తృతమైన సేవలను అందించినందుకుగాను హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్సు ప్రైవేటు లిమిటెడ్ సంస్థ జిల్లా ఎస్పీని కరోనా వారియర్‌గా గుర్తించి, అంతర్జాతీయ అవార్డును తే. 01-09-2020 ది, మంగళవారంనాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రధానం చేసారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ అన్ని రాష్ట్రాల్లో సర్వే నిర్వహిస్తూ, కోవిడ్ 19 సమయంలో ప్రజలకు నిస్వార్ధంగా, సేవలందించిన అధికారులను గుర్తించి, వారికి అంతర్జాతీయ పురస్కారాలను అందించే పనికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విజయనగరం జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీమతి బి. రాజకుమారి కోవిడ్ 19 విధులను సమర్ధవంతంగా ఒకవైపు నిర్వహిస్తూ, మరోవైపు ప్రజలను చైతన్యం చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం, వైద్యం అందించడం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో వలస కార్మికులకు భోజనాలను సమకూర్చి, నిరంతరం ప్రజాసేవలో భాగస్వామ్యులు అయ్యారు. కరోనా నియంత్రణకు అహర్నిశలు శ్రమించి, వారిని అప్రమత్తం చేయడం, జాగ్రత్తలు తీసుకొనే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, సుమారు మూడు మాసాలు జిల్లాలో ఒక్క కరోనా కేసు నమోదు కాకుండా అన్ని శాఖల వారిని సమన్వయం చేసారు. జిల్లాలోకి ఇతర ప్రాంతాల వారు ప్రవేశించకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, అనధికారంగా ఒక్క వాహనాన్ని కూడా జిల్లాలోకి అనుమతించకుండా చర్యలుచేపట్టారు. ఎప్పటికప్పుడు పోలీసు అధికారులకు సూచనలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, పోలీసు సిబ్బందికి దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్సు ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు కంది గౌరీ శంకర్, డా॥ కేశల అప్పారావు, డా॥ సత్తి అచ్చిరెడ్డి, డా॥ భేరి రాధికా రాణి, ఆర్. శంకర్ రెడ్డి, టి. దీప్తి, కంది అఖిల, వైభవ్, ఎఆర్ డిఎస్పీఎల్. శేషాద్రి, ఎస్బీ డిఎస్పీ వి. వెంకటప్పారావు, ఎస్బీ సిఐ ఎన్. శ్రీనివాసరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గన్నారు.

## దేశం గొప్పనేతను కోల్పోయింది: భీశెట్టి




మాజీ రాష్ట్రపతి,భారతరత్న ప్రణబ్ ముఖర్జీ మృతి దేశానికి తీరని లోటని దేశం గర్వించదగ్గ వ్యక్తి మృతి చెందడం పూడ్చ లేని లోటని లోక్సత్తపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు,భీశెట్టి ఫౌండేషన్ అదినేత భీశెట్టి బాబ్జి అన్నారు, ప్రాణబ్ ముఖర్జీ మృతి పై మంగళవారం బీఎన్ఆర్ ఆశ్రమం లో సంతాపసభ ఏర్పాటు చేశారు ప్రణబ్ ముఖర్జీ చిత్ర పటం కి జ్యోతి వెలిగించిన అనంతరం భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ భారత్ రాజకీయ చరిత్రలో ప్రణబ్ కి ప్రత్యేక స్థానం ఉందని, ప్రభుత్వం గాని పార్టీ గాని సంక్షోభంలో ఉంటే సరిదిద్దే సమయస్ఫూర్తి ఒక్క ప్రాణబ్ మాత్రమే ఉండేదని అందుకే ప్రాణబ్ ని దేశంలో ట్రబుల్ షూటర్‌గా అందరూ పిలిచేవారని బహుముక ప్రజ్ఞాశాలి ప్రణబ్ అని కొనియాడారు, విదేశీ, వాణిజ్య, ఆర్థిక, మంత్రిగా రాజ్యసభ నాయకుడిగా,రాష్ట్రపతిగా దేశానికి ఒక మార్గం చూపించారని,రాజకీయాలును కూడా ఎంతో హుందాగా నడిపి పదవులుకి వన్నె తెచ్చారని, నాలుగు తరాల నేతలు ఇందిరా,రాజీవ్,సోనియా,రాహుల్ తో కలిసి నడిచిన గొప్ప మనిషి తన జీవితాన్ని చివరి వరకూ కాంగ్రెస్ పార్టీకి అంకితం చేసి ఒక పాలసీకి కట్టుబడిఉన్నా అనే సంకేతం ప్రజలకు ప్రణబ్ ముఖర్జీ అందించారని,నేటి తరం నాయకులు ప్రణబ్ ముఖర్జీ లాంటి వారిని చూసి నేర్చుకోవాల్సిందే నని భీశెట్టి అన్నారు, ఈ కార్యాక్రమంలో ఆశ్రమం నిర్వహణా కమిటీ సభ్యులు నమ్మి శ్రీను, రెడ్డిపల్లి వెంకటరావు,పోటుపురెడ్డి శ్రీను,మట్టా గోవింద్,పూసర్ల రాజేశ్,పల్లా ఎర్నాయుడు, పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 549 వెంటనే అమలు చేయాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వి కృష్ణంరాజు



**సాలూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీవో నెంబర్ 549 ను వెంటనే అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వి కృష్ణంరాజు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మరియు ఘోష ఆసుపత్రి వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం విధులకు హాజరయ్యారు ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలో పారిశుద్ధ్య కార్మికులకు 549 జీవో ప్రవేశపెట్టడం జరిగిందని నేటికి 9 నెలలు కావస్తున్నా ఆ జీవో అమలు కాలేదు అన్నారు ఈ జీవో వల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు నాలుగు వందల మంది కార్మికులకు 16 వేల ఐదు వందలు రూపాయలు జీతం అమలు అవుతుందన్నారు కరోనా సమయంలో వారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలన్నారు ఇప్పటికే ఈ ఈ సమస్యపై రాష్ట్ర స్థాయి నాయకులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈ నెల 1,2,3 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది తమ నిరసన కార్యక్రమాన్ని చేపడతారని తెలిపారు ఈ కార్యక్రమంలో సంజీవమ్మ, అప్పయ్యమ్మ ,పాపాయమ్మ, లక్ష్మి, గౌరీ ,నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో పనులు పూర్తి చేయండి

### ఐ.టి.డి.ఏ, ప్రాజెక్ట్ అధికారి కూర్మనాథ్



**సాలూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వారికి సకాలంలో అందించాలి, గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించి వారి అభివృద్ధికి దోహద పడాలని ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి అర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ అధికారి మంగళవారం తన పర్యటనలో భాగంగా సాలూరు మండలం, కొదమ గ్రామపంచాయతీలో కొన్ని ఆవాశ గ్రామాలు, పట్టు చెన్నేరు, పగులుచెన్నేర్ పంచాయితీలో గ్రామాలు పర్యటించి గ్రామాలలో చేపడుతున్న వాటర్ షేడ్, ట్యాంకుల, కల్లాల పనులు పరిశీలించారు. పరిశీలన అనంతరం ప్రాజెక్ట్ అధికారి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పనులు సకాలంలో, త్వరితగతిన పూర్తిచేయాలని అలాగే పనులలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు, అలాగే ఏటువంటి సమస్యలున్న తెలిపితే పరిష్కరించు నిమిత్తం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామాలలో గిరిజన రైతులతో మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు ఆడిగి తెలుసు కున్నారు. తాగునీరు, రోడ్లు, వైద్యం, విద్యకు సంబంధించి మీకు అన్ని మౌలిక సదుపాయాల కల్పించనున్నట్లు తెలిపారు.

**పట్టు చెన్నేరులో నిత్యావసర సరుకులు**

చోర, చింతమలా, కొదమ, ఎన్.చింతలవలస గ్రామానికి చెందిన 366 కార్డు దారులు నంద గ్రామానికి వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి ప్రజలు చాలా శ్రమకు గురి అవుతున్నారని, వారి గ్రామానికి చేరువలో ఉన్న పట్టు చెన్నేరు గ్రామంలో నిత్యావసర సరుకులు అందించే నిమిత్తం నిత్యావసర సరుకుల పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని చింతామలా గ్రామ ప్రజలు సెప్టెంబర్ 3, గురువారం నుండి నిత్యావసర సరుకులు వారికి దగ్గరలో వున్న గ్రామం పట్టు చెన్నేరు లో పొందవచ్చున్నారు. ఈ పర్యటనలో ఏ.పి.డి శ్రీహరి, సి.ఎస్.డి.టి, వాటర్ షేడ్,రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం


## షెడ్యూల్డు కులాల వర్గీకరణ

షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదంటూ 2004లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ప్రస్తుత సుప్రీంకోర్టు ధర్మాసనం విభేదించింది. పంజాబ్‌కు చెందిన ఒక కేసును జస్టిస్ అరుణ్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం విచారిస్తూ రాష్ట్రాలకు ఆ హక్కు ఉన్నదని అభిప్రాయపడింది. అతి ముఖ్యమైన ఈ అంశం మీద న్యాయనిర్ణయం చేసేందుకు విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డేకు నివేదన పంపింది. 2004 నాటి తీర్పు ఇచ్చిన ధర్మాసనం, ఇప్పుడు విభేదించిన ధర్మాసనం రెండూ ఐదుగురు సభ్యులవే కాబట్టి, సమీక్షించే ధర్మాసనంలో సభ్యులు ఏడుగురు లేదా తొమ్మిది మంది ఉండే అవకాశం ఉన్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులోకి వచ్చిన షెడ్యూల్డు కులాల వర్గీకరణపై వ్యాజ్యంలో 2004లో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అధికారం కేవలం పార్లమెంటుకే ఉంటుందని, రాష్ట్రాలకు ఆ అధికారం లేదని తీర్పు చెప్పింది. దానితో, అతి కొద్దికాలం మాత్రమే వర్గీకరణ అమలు జరిగినట్టయింది. అప్పటి నుంచి వర్గీకరణ కోరే ఉద్యమకారులు తమ డిమాండ్ సాధనకై సంప్రదింపులు, మద్దతు సమీకరణలు, పోరాటాలు చేస్తూనే ఉన్నారు. గురువారం నాటి సుప్రీంకోర్టు తీర్పు తెలుగు రాష్ట్రాలలోనే కాక, దేశంలోని తక్కిన రాష్ట్రాలలో కూడా షెడ్యూల్డు కులాల వర్గీకరణ మార్గాన్ని సానుకూలం చేసింది. "సామాజికంగా, విద్యా విషయికంగా వెనుకబడిన వర్గాల్లో రిజర్వేషన్లను వర్గీకరించవచ్చునని ఇందిరా సహానీ కేసులో ఆనాటి బెంచి తీర్పు చెప్పింది. ఎస్సీ ఎస్టీల అంశం కూడా ఆర్టికల్ 16 కిందికే వస్తుంది కాబట్టి, ఆ వర్గీకరణ అనుమతి వీరికి కూడా వర్తిస్తుందనడానికి ఆస్కారం ఉన్నది.." అని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం నాటి తీర్పులో వ్యాఖ్యానించింది.తెలుగు రాష్ట్రాలలో వర్గీకరణ కోసం పోరాడుతూ వస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీస్) సహజంగానే ఈ పరిణామాన్ని హర్షించింది. "ఈ తీర్పు వేలాది ఉపకులాలకు ఊరట కలిగించింది, తాత్కాలికంగా అడ్డంకులు ఎదురైనా అంతిమ విజయం మాత్రం ధర్మానిదే" అని వర్గీకరణ ఉద్యమ నాయకులు మందకృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. కొత్తగా ఏర్పడే విస్తృత ధర్మాసనం త్వరితగతిన విచారించి, వర్గీకరణ జరిపే హక్కు రాష్ట్రాలకు ఉన్నదని నిర్ధారించిన పక్షంలో, రాష్ట్రప్రభుత్వాలపై ఉద్యమకారుల ఒత్తిడి పెరుగుతుంది. ఈలోగా, వివిధ రాష్ట్రప్రభుత్వాలు మరోసారి వర్గీకరణపై తమ వైఖరిని స్పష్టం చేయవలసి ఉంటుంది. వర్గీకరణ అమలుచేయాలని కోరుతూ ఉమ్మడి రాష్ట్ర శాసనసభ అనేక మార్లు తీర్మానాలు చేసింది. ఉద్యమం అనేక కారణాల వల్ల బలహీనంగా కనిపించినప్పుడల్లా పూర్వం సమర్థించిన పార్టీలే మౌనం వహించడం జరుగుతూ వస్తోంది. సృజనాత్మకమైన, మిలిటెంట్ పోరాటం చేయడం వల్ల ఎమ్మార్పీస్ ప్రసిద్ధమయింది కానీ, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్ కానీ, ప్రతిపాదన కానీ కొత్తది కాదు. షెడ్యూల్డు కులాలలో ఉద్యోగ నియామకాల్లోని రిజర్వేషన్లలో ఉపరిజర్వేషన్లను అమలుచేసే విధానాన్ని పంజాబ్ రాష్ట్రం 1975లోనే ప్రవేశపెట్టింది. హర్యానా కూడా ఉద్యోగాలతో పాటు, విద్యాప్రవేశాలలో కూడా ఉపరిజర్వేషన్ల విధానం అమలుకు 1994లో ప్రయత్నించింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా హర్యానా మాదిరి ప్రయత్నమే జరిగింది. అతి కొద్దికాలం వర్గీకరణ విధానం అమలు జరిగింది కూడా. 1976 నాటి షెడ్యూల్డు కులాల, తెగల (సవరణ) చట్టం ప్రకారం నాటి ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం 59 షెడ్యూల్డు కులాలు, ఉపకులాలు ఉన్నాయి. వీటన్నిటిలోను కేవలం రెండు కులాలు మాల, మాదిగ– మొత్తం షెడ్యూల్డు కులాల జనాభాలో 90 శాతం ఉండగా, తక్కిన పదిశాతం జనాభా తక్కిన కులాలది. మూకుమ్మడిగా అమలుచేసే రిజర్వేషన్ల కారణంగా అందరికీ సమన్యాయం జరగడం లేదన్న భావన మొదటి నుంచి ఉన్నప్పటికీ, 1990 నాటికి బలపడింది. అప్పటికే బలపడుతూ వస్తున్న దళిత ఉద్యమాల వాతావరణంలో, ఉపరిజర్వేషన్ల కోసం డిమాండ్ సంబంధిత కులాలలో భగ్గుమంది. దండోరా ఉద్యమం ప్రారంభమైంది. రామచంద్రరాజు కమిషన్ దగ్గర నుంచి ఉషా మెహ్రా కమిషన్ దాకా అందరూ వర్గీకరణలోని న్యాయాన్ని ప్రకటించినవారే. వర్గీకరణ అనుకూలత ప్రతికూలతలు వివిధ రాజకీయ పక్షాల ఎన్నికల వ్యూహాలతో ముడిపడి కనిపిస్తాయి. వర్గీకరణకు ఉన్న అవరోధాలు తొలగిపోతే, భారతీయ జనతాపార్టీ తన విజయవ్యూహంలో భాగంగా, అనేక రాష్ట్రాలలో వర్గీకరణను అమలు చేయవచ్చు.

# రాజశేఖర రైతుబంధు

# ఎదురేది నీకు ఈ లోకమందు

సెప్టెంబర్ 2 వర్ధంతి సందర్భంగా



యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (జూలై 8, 1949 – సెప్టెంబర్ 2, 2009) ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి, కాంగ్రెసు పార్టీ నాయకుడు. 1978లో తొలిసారిగా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంనుంచి శాసనసభలో అడుగుపెట్టిన రాజశేఖరరెడ్డి మొత్తం 6 సార్లు పులివెందుల నుంచి ఎన్నిక కాగా, 4 సార్లు కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంటులో అడుగుపెట్టాడు. ఆయన పోటీచేసిన ప్రతి ఎన్నికలలోనూ విజయం సాధించారు. జనతాపార్టీ ప్రభంజనాన్ని తట్టుకొని విజయం సాధించిన తొలి ఎన్నికల (1978) వెంటనే మంత్రిపదవి పొందాడు. ఆ తరువాత వెనువెంటనే ముగ్గురు ముఖ్యమంత్రులు మారిననూ ఆ మూడు మంత్రిమండళ్లలో స్థానం సంపాదించాడు. ఆ తరువాత చాలా కాలం పాటు ఎటువంటి ప్రభుత్వ పదవీ దక్కలేదు. 1989–94 మధ్య ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. 1999లో మళ్ళీ శాసనసభకు ఎన్నికై ప్రతిపక్షనేతగా ఉంటూ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు వ్యూహం రచించాడు. 2003లో మండువేసవిలో 1460 కిలోమీటర్లు %ళి18% సాగిన పాదయాత్ర, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రచారం అతని విజయానికి బాటలు పరచింది. 2004 ఎన్నికలలో పులివెందుల నియోజకవర్గం నుంచి 40వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు పొందడంతో ముఖ్యమంత్రి పీఠం వై.ఎస్.రాజశేఖరరెడ్డికే దక్కింది. ఆయన సెప్టెంబర్ 2, 2009న చిత్తూరు జిల్లాలో రచ్చబండ కార్యక్రమానికి హాజరవడానికి వెళ్తూ నల్లమల అడవులలో హెలికాప్టర్ ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యాడు. వైఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతిపై ఆయన మంత్రివర్గ సభ్యులే కాకుండా కేంద్రమంత్రులు, ప్రస్తుత మంత్రులు, ప్రధాన ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మైసూరారెడ్డి లెక్కలువేయగా%ళి2ర% అప్పటి మంత్రి పి.శంకర్రావు వ్యాఖ్యలను కోర్టు సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టింది. వైఎస్సార్ కాలంలో అవినీతి జరిగిందని సీబీఐ ప్రాథమిక విచారణలో వెల్లడించింది. "క్విడ్ ప్రో కో " రూపంలో వై. యస్. జగన్ కు చెందిన కంపెనీలలో పెట్టుబడులు వచ్చినట్లు సీబీఐ చార్జిషీటులో పేర్కొంది. వై.యస్.రాజశేఖర్ రెడ్డి 1949 జూలై 8 న వైఎస్ఆర్ జిల్లా, జమ్మలమడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు జయమ్మ, రాజారెడ్డి. ఆయన తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండటం వల్ల ఆయన పాఠశాల చదువంతా బళ్ళారిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చేరాడు. 1972లో గుల్బర్గా విశ్వవిద్యాలయం నుంచి వైద్యవిద్యలో పట్టా పుచ్చుకున్నాడు. గుల్బర్గాలోని మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్యవృత్తిని అభ్యసిస్తుండగానే కళాశాల విద్యార్థిసంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరించాడు. శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (యెస్.వి.ఆర్.ఆర్), తిరుపతి నుంచి హౌస్‌సర్జన్ పట్టా పొందాడు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల వైపు ఆకర్షితుడైన రాజశేఖరరెడ్డి యెస్.వి.ఆర్.ఆర్ కళాశాలలో పనిచేస్తుండగానే అక్కడ హౌస్‌సర్జన్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. తరువాత కొద్దిరోజులపాటు జమ్మలమడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా పనిచేశాడు. ఆ తరువాత 1973లో పులివెందులలో తండ్రి వై.ఎస్.రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేశాడు. ఆ ఆసుపత్రి ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. వాళ్ళ కుటుంబం పులివెందులలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలను కూడా నెలకొల్పారు. తరువాత వాటిని లయోలా సంస్థలకు అప్పగించారు. పులివెందుల దగ్గరిలో ఉన్న సింహాద్రిపురంలో ఉన్న కళాశాలను మాత్రం ఇప్పటికీ వీరి కుటుంబమే నిర్వహిస్తోంది. కళాశాల దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి చూపిన రాజశేఖరరెడ్డి 1980–83 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిపదవిని నిర్వహించాడు. కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎన్నికయ్యాడు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 6 సార్లు విజయం సాధించాడు. రాష్ట్ర శాసనసభ ప్రతిపక్షనేత గా, రెండు సార్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగానూ పనిచేశాడు. 1980 నుంచి 1983 దాకా గ్రామీణాభివృద్ధి, వైద్యశాఖ, విద్యాశాఖ మొదలైన కీలకమైన మంత్రి పదవులను నిర్వహించాడు. తెలుగు దేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతివాదిగా పేరుపడ్డారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989–94 మధ్య కాలంలో ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపాడు. మర్రి చెన్నారెడ్డిని, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డిని పదవినుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరాబాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్ రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అదే తాను ముఖ్యమంత్రి అయ్యేనాటికి అలాంటి శిబిరాలు లేని పరిస్థితిని సృష్టించుకోగలిగాడు. రాజకీయాల్లో ముక్కుసూటితనానికి, నిర్మొహమాట ధోరణికి రాజశేఖరరెడ్డి ప్రసిద్ధుడు. **పిసిసి అధ్యక్షుడిగా:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండు సార్లు పనిచేశాడు. తొలిసారి 1983 నుంచి 1985 వరకు, రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నాడు. 1999 నుంచి 2004 వరకు 11 వ శాసనసభలో ప్రతిపక్షనేతగానూ వ్యవహరించాడు.

**పాదయాత్ర:** 2003 వేసవికాలంలో ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించాడు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్.కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడింది.

**ముఖ్యమంత్రిగా:** 2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికస్థానాలు సాధించడంతో అదివరకే పార్టీలో పేరు సంపాదించిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించాడు. పాదయాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయటం, జలయజ్ఞంలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశాడు. 2009 ఏప్రిల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాడు. 1600 ఎకరాల భూమిని డిసెంబరు 2006లో ప్రభుత్వానికి అప్పగించటం విపక్షాల విమర్శకి గురయ్యింది. చట్టాన్ని అతిక్రమించి భూమిని కలిగివున్నందుకు విపక్షాలు రాజశేఖరరెడ్డి రాజీనామా చేయాలని కోరాయి. సెప్టెంబర్ 2, 2009 న చిత్తూరు జిల్లా పర్యటనకు బయలుదేరగా ఉదయం గం.9.35 నిమిషాలకు హెలికాప్టరుతో సంబంధాలు తెగిపోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తో సహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

# వసిష్ఠుని ఆగ్రహం: దశరథుని ఆక్రోశం

(నిన్నటి తరువాయి)



మహారాజు, మహారాణి వేడు కోళ్ళు విన్న జనం రథానికి అడ్డుపడసాగారు. రథచక్రాలను పట్టి నిలుపసాగారు. వారిస్తున్నా వినడం లేదెవరూ. తప్పు నాయనా! తప్పుకోండని చెబుతున్నా ఫలితం లేకపోతోంది. కరుణామయుడైనా ధర్మబద్ధుడు రాముడు. కఠిననిర్ణయం తీసుకున్నాడప్పుడు. సుమంత్రునితో గట్టిగా చెప్పాడిలా."రథాన్ని వేగంగా పోనీయ్" రథాన్ని పోనీయక జనం అటు అడ్డుపడుతున్నారు. రాముడు ఇటు రథాన్ని వేగంగా పోనీయమంటున్నాడు. రథాన్ని ఆపనా? లేదంటే మరింత వేగంగా ముందుకు పోనీయనా? ఏం చెయ్యనిప్పుడు? సందిగ్ధంలో పడ్డాడు సుమంత్రుడు. కైకతో తెంపుకున్న బంధం: కన్నీరుపాలయిన పౌరజనం సీతారామలక్ష్మణులు ప్రయాణిస్తున్న రథానికి అడ్డు పడుతున్నారు పౌరులు. పరుగుదీయకుండా రథచక్రాలను పట్టి నిలుపుతున్నారు. తప్పుకోండయ్యా! తప్పుకోండని సుమంత్రుడు హెచ్చరించినా ఫలితం లేకుండా పోతోంది. మహారాజు దశరథుడు చూడాలంటున్నాడంటూ తల్లి కౌసల్య కేకలేస్తూ పరుగున వస్తోంది. అయినా వెనుతిరిగి చూడడం లేదు రాముడు. ధర్మానికి కట్టుబడి రథాన్ని వేగంగా పోనీయమంటున్నాడతను. పోనీయనా? వద్దా? సందిగ్ధంలో ఉన్న సుమంత్రుణ్ణి గమనించాడు రాముడు. అన్నాడిలా."తండ్రిగారు ఈ దుఃఖాన్ని తట్టుకోలేరు సుమంత్రా! మనం కనిపిస్తున్న కొలదీ ఆయనకు ఈ దుఃఖం ఎక్కువవుతుంది. అది వారి ప్రాణానికే ముప్పు. అది తప్పించడానికే రథాన్ని వేగంగా పోనీయమంటున్నాను.""మహారాణి కేకేసినా రథాన్ని ఎందుకు ఆప లేదని మహారాజు నన్ను అడిగితే?" ప్రశ్నించాడు సుమంత్రుడు."జనసమ్మర్దంలో మహారాణిగారి అరుపులు వినిపించలేదని చెప్పు." అన్నాడు రాముడు.సరేనన్నట్టుగా సుమంత్రుడు రథచక్రాలనూ, వెనకభాగాన్నీ పట్టుకుని పరిగెడుతున్న పౌరుల్ని విడువమని ప్రార్థించాడు. మంత్రి మాటను మన్నించి కొందరు విడిచారు. ఇంకొందరు విడువలేదు. గుర్రాలను వేగంగా తోలాడు సుమంత్రుడు. ఆ వేగానికి విడువని వారు కూడా రథాన్ని విడచి, చేతులు జాచి నిలబడిపోయారు. దుమ్ము రేపు కుంటూ రథం వెళ్ళిపోయింది. పరుగుదీసిన రథాన్ని చూశారు మంత్రిసామంతులు. పలవిస్తున్న మహారాజుని చూశారు. అతన్ని సమీపించారు."తిరిగి రావాలని కోరుకునే ఆప్తుల వెంట హెచ్చుదూరం పోరాదంటారు మహారాజా, ఇది మీకు తెలియనిది కాదు." అన్నారు."అవునవును" అని, కన్నీరు కారుస్తూ వెళ్ళిపోయిన రథానికి గుర్తుగా చెలరేగిన ధూళిని చూడసాగాడు దశరథుడు. ఒక్కసారిగా చెమటలు పట్టిపోయాడు. చల్లనిగాలి కరువైపోయింది. ఎవరో బంధించినట్టుగా ఆగిపోయిందది. అంతటా వేడిగా, వడగాల్పులే వీస్తున్నాయి. రాముడు లేడు, రామరక్ష లేదనే భయం అయోధ్య అణువణువునా నిండిపోయిందేమో! సన్నగా భూమి కూడా కంపించింది.ధూళి చెదిరిపోయింది. ఎక్కడా రథం కనిపించడం లేదు. పౌరులు వెనుతిరిగి వస్తున్నారు. అంటే... రాముడు సుదూరాలకు వెళ్ళిపోయాడు. నగరాన్ని దాటి వెళ్ళిపోయాడనుకున్నాడు దశరథుడు. నెత్తికొట్టుకున్నాడు. నడిబాట మీద బూడిదలో పడి పొర్లసాగాడు. అతన్ని వారించింది కౌసల్య. కుడిచేయి పట్టుకుని లేవదీసింది. ఆ చేతిని తన భుజంమీద వేసుకున్నది. వచ్చి, ఎడమచేతిని తన భుజంమీద వేసుకోబోయింది కైక, మహారాజుకి ఆసరా కాబోయింది. ఆమె స్పర్శను సహించలేకపోయాడు దశరథుడు. చేతిని వెనక్కి గుంజుకున్నాడు. ఆమెను అసహ్యించుకున్నాడు."పాపాత్మురాలా! ఇక నుండీ నువ్వు నన్ను తాకరాదు. పో! దూరంగా పో! నీ ముఖం కూడా నాకు చూపించకు.""మహారాజా" దిగ్భ్రమచెందింది కైక."ఛీ! అధికారం కోసం, డబ్బు కోసం ధర్మాన్ని బలిపెట్టిన నువ్వు, నాకు భార్యవి కావు. బాంధవివి అంతకన్నా కావు. అగ్నిసాక్షిగా ఆనాడు అందుకున్న నీ హస్తాన్ని, ఈనాడు ఇప్పుడు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ కూడా విడిచిపెడుతున్నాను. నీ ఇష్టం, నువ్వెలా ఉండాలంటే అలా ఉండు. ఎలా బతకాలంటే అలా బతుకు. అలాగే అధర్మంగా లభించిన ఈ రాజ్యాన్ని నీ కొడుకు భరతుడు బాగున్నదనుకుంటే, దీంతో ఆనందిస్తే వాడు చేసే పరలోక క్రియలు నాకందనక్కర్లేదు." అన్నాడు దశరథుడు.

దోసిలితో రాజమార్గంలోని బూడిదను తీసి, శపించినట్టుగా కైక మీదికి విసిరాడు. స్పృహ కోల్పోయాడు. మహారాజు మళ్ళీ స్పృహ కోల్పోవడంతో అతన్ని చుట్టుముట్టి పత్నులంతా దుఃఖించ సాగారు. తానిక అక్కడ ఉండడం క్షేమం కాదనుకున్నది కైక. వెళ్ళిపోయిందామె. కాస్సేపటికి దశరథుడు తేరుకున్నాడు. "ఇటు మీరూ, అటు రాముడూ నన్ను ఏకాకిని చేద్దామనుకుంటున్నారా? ధైర్యాన్ని చిక్కబట్టుకోండి, లేవండి." అన్నది కౌసల్య. దశరథుని లేవదీసి, ముందుకు నడిపించిందతన్ని. కైక కోసం చూశాడు దశరథుడు. కనిపించలేదామె. ఎక్కడో ఉండే ఉంటుందనుకున్నాడు. గట్టిగా కేకలేశాడిలా."ఇదిగో కైకా! ఈ రాజ్యం నీ ఇష్టం, దీన్నేం చేసుకుంటావో చేసుకో! రాముడి లేని రాజ్యం రాజ్యం కాదు. అలాగే రాముడు లేక నేను కూడా లేను. అయిపోయింది, అంతా అయిపోయింది. నేనిక చావడమే మిగిలింది."

(మిగతా రేపటి సంచికలో)

# మహాలయ పక్షం అంటే ఏమిటి?

మహాలయ పక్షం అంటే ఏమిటి బాబు అని ఒక 68 సంవత్సరాల పెద్దావిడ నన్ను అడగటం ఆశ్చర్యం కలిగింది. అందుకే నాకు తెలిసిన విషయాలు అందిస్తున్న.

కర్ణుడు భూలోకంలో గడిపి.. స్వర్గానికి వెళ్లిన పక్షమే మహాలయ పక్షం! భాద్రపద బహుళ పాడ్యమి నుంచి ప్రారంభమై మహాలయ అమావాస్యతో పూర్తవుతుంది.ఈ మహాలయ పక్షంలో ఉదయమే మీ ప్రధాన ద్వారం ముందు లోపల నిలబడి చేతులు జోడించి, మీ పితృదేవతలను స్మరించి,వారికి నమస్కారము చేస్తూ, నేను పితృపక్షము పాటించుటకు అశక్తుడను. కావున నన్ను మన్నించి, మీ దీవెనలు అందచేయండి' అని మనస్సులో ప్రార్థన చేయడం ద్వారా శుభఫలితాలు ఉంటాయి. ఇంకా మహాలయా పక్షమున పితృదేవతలకు శ్రాద్ధ కర్మలు నిర్వహించవచ్చు. భాద్రపదమాసంలోని శుక్లపక్షం దేవతాపూజలకు ఎంత విశిష్టమైనదో, బహుళ పక్షం పితృదేవతా పూజలకు అంత శ్రేష్ఠమైనది. పితృదేవతలకు ప్రీతికరమైన పక్షం గనుక దీనికి పితృపక్షమని, మహాలయ పక్షమని పేరు.

ఈ పక్షం ముగిసే వరకు.. ప్రతిరోజూ పితృదేవతలకు తర్పణ, శ్రాద్ధ విధులను నిర్వహించాలి.కుదరని పక్షంలో తమ పితృదేవతలు ఏ తిథినాడు మృతిచెందారో, ఈ పక్షంలో వచ్చే అదే తిథినాడు శ్రాద్ధం నిర్వర్తించాలి.తండ్రి జీవించి, తల్లిని కోల్పోయినవారైతే ఈ పక్షంలో వచ్చే నవమినాడు తర్పణ, శ్రాద్ధ విధులను ఆచరించాలి.తల్లీతండ్రీ ఇద్దరూ లేనివారు ఈ పక్షాన తప్పక పితృకర్మలు చేయాలి.ఈ పక్షమంతా చేయలేనివారు ఒక్క మహాలయ అమావాస్య నైనా చేసి తీరాలి.

దానశీలిగా పేరుపొందిన కర్ణుడికి...మరణానంతరం స్వర్గం ప్రాప్తించింది.ఆయన స్వర్గలోకానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఆకలి, దప్పిక కలిగాయి.ఇంతలో ఒక ఫలవృక్షం కనిపించింది.పండు కోసుకుని తిందామని నోటి ముందుంచుకున్నాడు ఆశ్చర్యం! ఆ పండు కాస్తా బంగారపు ముద్దగా మారిపోయింది.ఆ చెట్టుకున్న పండ్లే కాదు, మిగతా ఏ చెట్టు పండ్లు కోయబోయినా అదే అనుభవం ఎదురైంది. ఇలా లాభం లేదనుకుని కనీసం దప్పికయినా తీర్చుకుందామనుకుని.. సెలయేటిని సమీపించి దోసిట్లోకి నీటిని తీసుకుని నోటి ముందుంచుకున్నాడు. ఆ నీరు కాస్తా బంగారపు నీరుగా మారిపోయింది. స్వర్గలోకానికెళ్లాక అక్కడ కూడా అదే పరిస్థితి ఎదురైంది. దాంతో కర్ణుడు తాను చేసిన తప్పిదమేమిటి, తనకిలా ఎందుకు జరుగుతున్నదని వాపోతుండగా... "కర్ణా! నీవు దానశీలిగా పేరు పొందావు. చేతికి ఎముక లేకుండా దానాలు చేశావు. అయితే ఆ దానాలన్నీ బంగారం, వెండి, డబ్బు రూపేణా చేశావు గానీ, కనీసం ఒక్కరికి కూడా అన్నం పెట్టి ఆకలి తీర్చలేదు. అందుకే నీకీ దుస్థితి ప్రాప్తించింది"అని అశరీరవాణి పలుకులు వినిపించాయి. కర్ణుడు తన తండ్రి అయిన సూర్యదేవుని వద్దకెళ్లి పరిపరివిధాల ప్రాధేయపడగా, ఆయన కోరిక మేరకు దేవరాజయిన ఇంద్రుడు కర్ణునికి ఒక అపురూపమైన అవకాశమిచ్చాడు. నీవు వెంటనే భూలోకానికెళ్లి అక్కడ అన్నార్తులందరికీ అన్నం పెట్టి, అతడిని పెంచిన మాతాపితరులకు తర్పణలు వదిలి తిరిగి రమ్మన్నాడు. ఆ సూచన మేరకు కర్ణుడు భాద్రపద బహుళ పాడ్యమినాడు భూలోకానికి చేరాడు. అక్కడ పేదలు, బంధుమిత్రులు అందరికీ అన్నసంతర్పణ చేశాడు. పితరులకు తర్పణలు వదిలాడు. తిరిగి అమావాస్యనాడు స్వర్గానికెళ్లాడు. ఎప్పుడైతే కర్ణుడు తిరిగి వచ్చి భూలోకంలో.. అన్న సంతర్పణలు, పితృతర్పణలు చేశాడో అప్పుడే ఆయనకు కడుపు నిండిపోయింది ఆకలి తీరింది. కర్ణుడు భూలోకంలో గడిపి, తిరిగి స్వర్గానికెళ్లిన ఈ పక్షం రోజులకే మహాలయపక్షమని పేరు. ఈ మహాలయ పక్షములో చివరి రోజే మహాలయ అమావాస్యగా పిలుస్తారు.

తేనె వంటిదీ నాతెనుగు! వెన్నలాంటిదీ నాతెలుగు! వెన్నెల లాంటిదీ నాతెలుగు! మీగడతరకలాంటిదీ నాతెలుగు! పాలమీగడ లాంటిది నాతెలుగు! అమృతమయమైనదీ నాతెలుగు! అమ్మ ప్రేమ లాంటిది నాతెలుగు! అమ్మ ఆత్మీయత నాతెలుగు! అమ్మ అనుబంధం నాతెలుగు! కమ్మనైనదీ నాతెలుగు! భాషల్లో ఘనమైనదీ నాతెలుగు! అజంతమైనదీ నాతెలుగు! సుందరమైనదీ నాతెలుగు! ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ నాతెలుగు! రాయలచేత కొనియాడబడినదీ నాతెలుగు! ప్రముఖుల ప్రశంసలనొందినదీ నాతెలుగు! ప్రపంచవ్యాప్తమైనదీ నాతెలుగు! పురాతనమైనదీ నాతెలుగు! జానపదసాహిత్యసంపదనిలయమీ నాతెలుగు!భాషా సౌష్టవంకలదీ నాతెలుగు! పాలలాస్వచ్ఛమైనదీ నాతెలుగు! అపురూపమైనదీ నాతెలుగు! అనన్యమైనదీ నాతెలుగు! అత్యద్భుతమైనదీ నాతెలుగు! ఎన్నోప్రక్రియలనిలయమీ నాతెలుగు!



– మల్లాది సోమేశ్వర శర్మ,
9603995769

## తేనె 'పలుకు'

సంతృప్తి సాధనలో ఉండదు, ప్రయత్నంలో ఉంటుంది. పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తే విజయం కూడా పూర్తిస్థాయిలోనే అందుతుంది.



– మహాత్మాగాంధీ




# ఫిల్మ్ సిటీలో లవ్ స్టోరి..

నాగ చైతన్య, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో లవ్ స్టోరి పేరుతో శేఖర్ కమ్ముల ఓ సినిమాను సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. శేఖర్ 'ఆనంద్' అనే సినిమాతో తెలుగువారికి కొత్త రకమైన సినిమాను పరిచయం చేసిన దర్శకుడు. ఆయన సునిశితమైన కథలతో సహజ సన్నివేశాలతో మనసులను హత్తుకునే మాటలతో మంచి కాఫీ లాంటి చిత్రాలను తీస్తూ తెలుగువారి హృదయాలను దోచుకుంటున్నాడు. తన తాజా చిత్రాన్ని నాగ చైతన్య సాయి పల్లవిలు హీరో హీరోయిన్స్‌గా ఓ ప్రేమ కథా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా కరోనా కారణంగా ఆగిపోయింది. దాదాపు మూడు నెలల నుండి పెద్ద సినిమాలేవి షూటింగ్ జరుపుకోవడం లేదు. ప్రభుత్వం కొన్ని గైడ్ లైన్స్‌తో షూటింగ్ జరుపుకోవచ్చని అనుమతి ఇచ్చిన పెద్దగా ఆసక్తి చూపించట్లేదు నటీ నటులు. రిస్క్ ఎందుకని అంతా ఇంట్లో కూర్చుంటున్నారు. చిన్నాచితకా సినిమాలు మాత్రం సెట్స్ పైకొచ్చాయి. కాస్త రిస్క్ చేసి పనికానిస్తున్నారు. ఈ విషయంలో అందరికంటే ముందుగా నాగచైతన్య చొరవ తీసుకునేలా కనిపిస్తున్నాడు. తన లవ్ స్టోరీ సినిమాకు సంబంధించి ఆఖరి షెడ్యూల్ ను త్వరలోనే ప్రారంభించాలని ఫిక్స్ అయ్యాడు. అందులో భాగంగా వచ్చే నెల మొదటి వారం (అక్టోబర్ ఫస్ట్ వీక్) నుంచి లవ్ స్టోరీ ఫైనల్ షెడ్యూల్ ఫిల్మ్ సిటీలో మొదలుకానుందని సమాచారం. ఈ మేరకు రామోజీ ఫిలింసిటీలో ఓ సెట్ నిర్మిస్తోంది చిత్రబృందం. అక్కడే ఈ సినిమాకు చెందిన క్లైమాక్స్ చిత్రీకరించనున్నారని సమాచారం. ఇక ఆ మధ్య ఈ సినిమా నుంచి ఓ పాట విడుదలై మంచి ఆదరణ పొందింది. సోషల్ మీడియాలో టాప్‌లో ట్రెండ్ అవ్వుతూ అదరగొట్టింది. దీంతో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు ఏర్పడ్డ హైప్ మేరకు ఈ సినిమా శాటిలైట్ అండ్ ఓవర్సీస్ రైట్స్ ఓ రేంజ్‌లో అమ్ముడుపోయాయని టాక్. ఈ సినిమా చైతన్య గత సినిమాలన్నింటికంటే భారీ ధర పలికిననట్లు తెలుస్తోంది. శేఖర్ కమ్ముల గత చిత్రం 'ఫిదా' భారీ బ్లాక్ బస్టర్ అయింది. ఈ సినిమా ఓవర్సీస్ ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. దీంతో ఈ తాజా సినిమాకు కూడా ఓవర్సీస్‌లో మంచి డిమాండ్ ఉందట. దానికి తోడు సాయి పల్లవి ఫ్యాక్టర్ కూడా సినిమాకు మంచి హైప్ రావడానికి కారణం అవుతోంది. ఈ సినిమాను నారాయణదాస్ నారంగ్ నిర్మిస్తున్నాడు. ఈయన ఏసియన్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పేరుతో ఇప్పటి వరకూ వందలాది సినిమాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## పాయల్ ఘోష్ అందాల విందు..

పాయల్ ఘోష్... మంచు మనోజ్ హీరోగా చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో వచ్చిన 'ప్రయాణం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది పాయల్. ఆ సినిమాలో క్యూట్‌గా హారిక పాత్రలో అలరించిన పాయల్.. ఆ తర్వాత ఎన్టీఆర్ ఊసరవెల్లిలో మెరిసింది. ఓ పది సినిమాల్లో చేసిన ఏ సినిమా ఈ భామకు సరైనా గుర్తింపును ఇవ్వలేదు. ఇక చేసేదేం లేక హాట్ ఫోటో షూట్‌లు చేస్తూ సోషల్ మీడియాను ఊపేస్తోంది.





# వావ్ ఈషా రెడ్ హాట్ సూపర్



తెలుగమ్మాయిలకు తెలుగులో ఆఫర్లు రావు.. వచ్చినా కూడా చిన్నా చితకా హీరోయిన్ లేదంటే క్యారెక్టర్ ఆర్టిస్టు పాత్రలే వస్తాయి అనడంలో సందేహం లేదు. కాని కొందరు అమ్మాయిలు మాత్రం పట్టుదలతో ప్రయత్నాలు చేస్తూ హీరోయిన్ గా తమను తాము నిరూపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో ఈషా రెబ్బ ఒకరు. తెలుగు అమ్మాయే అయినా కూడా ఈ అమ్మడి అందాల ప్రదర్శణ బాలీవుడ్ హీరోయిన్స్ రేంజ్ లో ఉంటుంది. స్కిన్ షో కు ఏమాత్రం మొహమాట పడని హీరోయిన్ ఈషా రెబ్బా.తన నుండి ఎంత గ్లామర్ అవసరమో అంత గ్లామర్ ను ఒలకబోస్తూ ఫొటో షూట్ లకు ఫోజ్ లు ఇస్తున్న ఈ అమ్మడు ఇప్పుడిప్పుడే పెద్ద హీరోల కంట పడుతోంది. తెలుగమ్మాయిలు అంటే కాస్త వెనుకంజ వేసే మన హీరోలు ఈషా విషయంలో మాత్రం ఆసక్తిని కనబర్చుతున్నట్లుగా అనిపిస్తుంది. తాజాగా రెడ్ డ్రస్ లో ఎప్పటి మాదిరిగా స్కిన్ షో చేస్తూ దిగిన ఫొటో షూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫొటోపై మీరు ఒక లుక్కేయండి.


# సునీల్ మళ్లీ హీరో అయ్యాడుగా...



కమెడియన్ సునీల్ హీరోగా మారిన తర్వాత కమెడియన్ గా మళ్ళీ కనిపించలేదు. అందాల రాముడు, మర్యాద రామన్న, పూల రంగడు చిత్రాల ద్వారా మంచి విజయాలు రావడంతో హీరోగానే కంటిన్యూ అయ్యాడు. ఐతే హీరోగా ఎక్కువ సినిమాల్లో కనిపించినప్పటికీ నిలబడలేకపోయాడు. దాంతో మళ్ళీ బ్యాక్ టు కామెడీ అంటూ కమెడియన్ గా ప్రయత్నించాడు. త్రివిక్రమ్ సినిమాల ద్వారా కమెడియన్ గా రీ ఎంట్రీ ఇచ్చినప్పటికీ ఆ పాత్రలకి ప్రేక్షకుల నుండి సరైన స్పందన రాలేదు. దాంతో అటు విలన్ గానూ ప్రయత్నించాడు. డిస్కోరాజా సినిమాలో విలనిజం ప్రదర్శించాడు. ప్రస్తుతం కలర్ ఫోటో చిత్రంలో పవర్ ఫుల్ విలన్ గా దర్శనమివ్వనున్నాడు. ఐతే ఇటు విలన్ గా, కమెడియన్ గా సినిమాలు చేస్తున్న సునీల్, మళ్లీ హీరోగా సినిమా చేయడేమోనని అనుకున్నారు. కానీ అలా అనుకున్న వాళ్ళందరికీ షాక్ ఇస్తూ సునీల్ కొత్త చిత్రం ప్రకటించాడు. వేదాంతం రాఘవయ్య అనే టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కథ అందిస్తున్నారు. 14రీల్స్ ప్లస్ బ్యానర్ లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దర్శకుడు తదితర విషయాలేవీ ఇంకా ప్రకటించలేదు.

## పవర్ ఫుల్ పోలీస్‌గా శ్రద్ధా దాస్

కొంత మంది భామలకు అందం ఉన్న అదృష్టం కలిసి రాదు.అన్నింటికీ సిద్ధమైన అవకాశాలు రావు. అతి కొద్ది మంది మాత్రమే అందం, అభినయానికి అదృష్టం కలిసి వచ్చి స్టార్ హీరోయిన్స్ గా మారుతారు.మొదటి కేటగిరీలో ఉండిపోయిన అందాల భామ శ్రద్ధా దాస్. ఈమెకి కావాల్సినంత అందం ఉంది, అవసరం అయితే బికినీలో నటించేంత ధైర్యం ఉంది.యాక్టింగ్ లో కూడా శ్రద్ధగా దృష్టి పెట్టి ఇచ్చిన పాత్రలకి న్యాయం చేస్తుంది. కానీ మొదటి నుంచి ఈమెని సెకండ్ హీరోయిన్ కేటగిరీలోనే టాలీవుడ్ దర్శకులు ఉంచారు.అది కూడా కేవలం అందాల ప్రదర్శనకు అన్నట్లు ఉపయోగించు కున్నారు. దీంతో ఈమె ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి దశాబ్ద కాలం దాటిపోయినా ఇప్పటికి సరైన గుర్తింపు సొంతం చేసుకోలేక పోయింది. బాలీవుడ్‌లో అడపాదడపా ప్రయత్నం చేసిన కూడా అక్కడ శ్రద్ధా దాస్ కి పెద్దగా గుర్తింపు రాలేదు.అయితే ఇలాంటి భామలు అందరికి ఇప్పుడు తమని తాము ప్రూవ్ చేసుకోవడానికి, నటిగా ఎలివేట్ చేసుకోవడానికి ఓటీటీ ప్లాట్ ఫామ్ బెస్ట్ అప్షన్‌గా దొరికింది.వెబ్ సిరీస్ లో డిఫరెంట్ పాత్రలు చేసే ఛాయస్ ఉండటంతో అక్కడ తమని ప్రూవ్ చేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. శ్రద్ధాదాస్ కూడా ఇప్పుడు ఓ వెబ్ సిరీస్ లో పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతుంది.ఈ విషయాన్ని ఆమె స్వయంగా తెలియజేసింది.నా కెరీర్‌లో ఫస్ట్‌టైమ్ పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా నటిస్తున్నా.పోలీస్ డ్రస్ వేసుకుంటే వచ్చే కిక్కే వేరు అని అంటోంది.



# గోవా బ్యూటీ వెబ్ సిరీస్ ఎంట్రీ

బాలీవుడ్.. టాలీవుడ్.. కోలీవుడ్ ఇలా అన్ని భాషల స్టార్స్ ఇప్పుడు ఓటీటీ కంటెంట్ పై దృష్టి పెడుతున్నారు. కొందరు తమ సినిమాలను ఓటీటీలో విడుదల చేస్తుంటే మరికొందరు మాత్రం ఓటీటీ కోసం వెబ్ సిరీస్ లో నటించేందుకు సిద్దం అవుతున్నారు. ఆఫర్లు లేని హీరోయిన్స్ కు ఇప్పుడు ఓటీటీ అనేది చాలా మంది ఛాన్స్ గా మారింది. గోవా బ్యూటీ ఇలియానా బాలీవుడ్ లో ఆఫర్లు లేక సౌత్ వైపు చూసింది. ఇక్కడ నుండి కూడా ఆమెకు ఎలాంటి ఛాన్స్ లభించలేదు. దాంతో ఆమె కెరీర్ ముగిసినట్లే అనుకున్నారు. కాని అనూహ్యంగా ఇల్లీ బేబీ బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగన్ కు జోడీగా ఒక వెబ్ సిరీస్ లో నటించే అవకాశం దక్కించుకుంది.ఇంగ్లీష్ లో బ్లాక్ బస్టర్ సక్సెస్ దక్కించుకున్న 'లూథర్' టీవీ సీరీస్ ను హిందీలో రీమేక్ చేసేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ రెడీ అయ్యింది. ఇప్పటికే బాలీవుడ్ ఫిల్మ్ స్టార్స్ హృతిక్ రోషన్.. సైఫ్ అలీ ఖాన్.. సోనాక్షి సిన్హా వంటి వారు వెబ్ సిరీస్ ల్లో నటించేందుకు సిద్దం అయ్యారు. ఇప్పుడు అజయ్ దేవగన్ ఇలియానాలు కూడా 'లూథర్' రీమేక్ లో నటించబోతున్నారు. ఈ వెబ్ సిరీస్ ను అతి త్వరలో ప్రారంభించబోతున్నారు. ఇండియన్ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా మార్పులు చేర్పులు చేస్తూ స్క్రిప్ట్ ను రెడీ చేశారట. ఈ వెబ్ సిరీస్ తో అయినా ఇల్లీ బేబీ మళ్లీ బాలీవుడ్ లేదా సౌత్ లో బిజీ అయ్యేనో చూడాలి.



# షూటింగ్‌కి రెడీ!



కరోనా కారణంగా సినిమా షూటింగ్ లు ఏకంగా ఆరు నెలల పాటు బంద్ అయిపోయాయి.ఓ విధంగా ఈ కరోనా ఎఫెక్ట్ సినిమా నిర్మాతలకి వందల కోట్ల రూపాయిలు నష్టాలు మిగిలిస్తే. సినిమా ఇండస్ట్రీని నమ్ముకొని బ్రతుకుతున్న ఎంతో మందికి ఉపాధి లేక ఆర్ధిక ఇబ్బందులతో రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.ఇప్పటికి సినీ కార్మికులకి ఆర్ధిక కష్టాలు ఉన్నాయి. సినిమా షూటింగ్ లు స్టార్ట్ చేసిన ఒకప్పటి మాదిరిగా భారీ క్రౌడ్ ఉండే అవకాశాలు లేవు కాబట్టి ఈ ఆర్ధిక ఇబ్బందులు మరికొంత కాలం ఇలాగే కొనసాగుతాయి.అయితే కరోనా కారణంగా మధ్యలో అర్ధాంతరంగా ఆగిపోయిన సినిమా షూటింగ్‌లు మళ్ళీ మొదలవుతున్నాయి. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ షూటింగ్ లు ప్లాన్ చేసుకుంటున్నారు.ఇక మన హీరోలకి కూడా ఇంట్లో ఉండి బోర్ కొట్టిందేమో షూటింగ్ లకి రెడీ అంటున్నారు. ఈ వరుసలో ముందుగా సందీప్ కిషన్ లైన్ లోకి వచ్చాడు. సందీప్ కిషన్ హీరోగా చేస్తున్న ఏ1 ఎక్స్ ప్రెస్ మూవీతో పాటు నిర్మాతగా చేస్తున్న వివాహభోజనంబు సినిమాలని కూడా సెట్స్ పైకి తీసుకొని వెళ్తున్నాడు.ఏ1 ఎక్స్ ప్రెస్ సినిమాలో సందీప్ కిషన్ హాకీ ప్లేయర్ గా నటిస్తున్నాడు.ఈ సినిమాలో సందీప్ కి జోడీగా లావణ్య త్రిపాఠి నటిస్తుంది. ఇదిలా ఉంటే తాను నిర్మాతగా తీస్తున్న వివాహభోజనంబు సినిమా షూటింగ్ తాజాగా స్టార్ట్ చేశాడు.అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమాని సందీప్ ఆవిష్కరించబోతున్నాడు. ఇక తమిళ రీమేక్ గా తెరకెక్కుతున్న ఏ1 ఎక్స్ ప్రెస్ మీద సందీప్ గట్టి నమ్మకంతో ఉన్నాడు.ఈ సినిమాకి కూడా అతను సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. మొత్తానికి అందరికంటే ముందు కరోనాకి ఎదురెళ్లి సినిమా షూటింగ్ లు స్టార్ట్ చేశాడు.మరి సందీప్ దారిలో ఎంత మంది నడుస్తారు అనేది చూడాలి.

## ఆయేషా కేసుతో 'వి'

విజయవాడలో జరిగిన -ఆయేషా- కేసు తెలుగునాట సంచలనం సృష్టించింది. కొన్ని సినిమాల కథలకు ముడిద సరుకుగా నిలిచింది. నాని సుధీర్‌బాబుల -వి సినిమాలోనూ ఆయేషా కేసు లాంటి ప్రస్తావన ఉంటుందని, కథలో ఇన్వెస్టిగేషన్ కూడా ఈ కేసు చుట్టూనే తిరుగుతుందని తెలుస్తోంది. ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ లా కనిపిస్తున్నా.. అందులో రివెంజ్ డ్రామాని దర్శకుడు ఇంద్రగంటి మోహన కృష్ణ తెలివిగా జోడించాడని సమాచారం. తన జీవితంలో జరిగిన ఓ దారుణమైన ఘటనకు నాని ఎలా, ఏ విధంగా ప్రతికారం తీర్చుకున్నాడన్నది కథ. నాని మిలటరీ అధికారిగా నటించాడు. ఓ మిలటరీ అధికారికి ఎవరిపై, ఎందుకు ప్రతికారం తీర్చుకోవాల్సివచ్చిందన్నది కాన్సెప్ట్. సుధీర్ బాబు పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నాడు. అతిధిరావు హైదరీ, నివేదా థామస్ కథానాయికలుగా నటించారు. కథలో వీరిద్దరి పాత్ర చాలా కీలకమని సమాచారం. సెప్టెంబరు 5న ఈ చిత్రాన్ని అమేజాన్ ప్రైమ్ లో విడుదల చేస్తున్నారు.



# తిరుపతి, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు వార్తలు



ఎఎల్ పురం గ్రామంలో ఈరోజు వైసీపీ సీనియర్ నాయకులు చిటికెల భాస్కర్ నాయుడి గారు పారిశుద్ధ్య కార్మికులకు రెండు జతలు యూనిఫామ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పంచాయతీ సెక్రటరీ అప్పారావు నాయకులు పాల్గొన్నారు. – వార్తావళి, ఎఎల్‌పురం



సిహెచ్ నాగపురం గ్రామంలో ఈరోజు గ్రామం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు నిల్వ లేకుండా చేసి గ్రామం మొత్తం హైడ్రో క్లోరిపైతో స్ప్రే చేయడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుల యలమంచిలి రఘురామ్ గ్రామ సచివాలయం సిబ్బంది సెక్రటరీ లోవరాజు వాలంటీర్స్ పాల్గొన్నారు. – వార్తావళి, ఎఎల్‌పురం

## నెల్లూరులో టాలీవుడ్ హీరోలు



**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** టాలీవుడ్ యువ హీరోలు రామ్ చరణ్, శర్వానంద్‌లు నెల్లూరులో ఆకస్మిక పర్యటన చేశారు. ప్రముఖ నిర్మాత, యూవీ క్రియేషన్స్ అధినేతలలో ఒకరైన వంశీ కృష్ణా రెడ్డి తండ్రి మృతి చెందడంతో, అంత్యక్రియలలో పాల్గొనడానికి వారు నెల్లూరుకు వచ్చారు. వారి రాకకు సంబంధించిన వార్తతో అభిమానులు వారు ఉన్న ప్రాంతానికి పోటెత్తారు. దీంతో, ఇంటి బయట వేచి ఉన్న అభిమానుల కోసం హీరోలిద్దరూ మేడపైకి వచ్చి, వారికి అభివాదం చేశారు. అనంతరం అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. అంత్యక్రియల సమయంలో కూడా అభిమానుల హడావుడి ఎక్కువగానే ఉంది. ఫొటోలు, వీడియోలు తీయడంలో ఫ్యాన్స్ మునిగిపోయారు. కానీ, వారిద్దరు మాత్రం కార్యక్రమం ముగిసేంత వరకు మౌనంగా ఉన్నారు. కార్యక్రమం అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## సి.పి.ఎస్. విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి

**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంట్రీబ్యూటరీ పెన్షన్ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి. నరసారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు మంగళ వారం ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సి.పి.ఎస్. విధానం వలన ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతారన్నా రన్నారు. పదవీ విరమణ అనంతరం సాంఘిక భద్రతను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసారు. గత పాదయాత్ర సందర్భంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే సి.పి. ఎస్. విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారన్నారు. గత ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులు అందరు ఎత్తున ఆందోళన చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పరిష్కరిస్తామని అమ్మ ఇచ్చారన్నారు. మరోసారి ముఖ్యమంత్రి గుర్తు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకాలలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్నామన్నారు. ఉద్యోగులకు గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని, ఇప్పటి వరకు సర్వీస్ లో ఉంటూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. సి.పి. ఎస్. ఉద్యోగుల కంట్రీబ్యూషన్ నగదు మొత్తా న్ని ఆన్‌లైన్ చేయాలని, పాత పెన్షన్ విధానం వలన పొందే అన్ని ప్రయోజనాలను సి.పి. ఎస్. ఉద్యోగులకు కల్పించాలన్నారు. అలాగే ఒప్పంద ఉద్యోగులకు కూడా పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉదయగిరి తాలూకా అధ్యక్షులు ఎన్. కొండారెడ్డి, సహాయ కార్యదర్శి ఖాజా ముబారక్, ఉద్యోగులు షఫీ, హసానయ్య, బాలుడు, సంధాని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్‌కు కరోనా పాజిటివ్

### వారం రోజుల పాటు కార్యాలయం మూత




**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కార్యాలయ రిజిస్టర్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వారం రోజుల పాటు సెలవు ప్రకటించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం, ఖజానా కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయం, ఇండియన్ గ్యాస్ కార్యాలయం, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం అన్నీ కలిసి ఒకే సముదాయంలో ఉండటంవల్ల నిత్యం ప్రజల రాకపోకలు అధికంగా జరుగుతూ ఉంటాయి. ఈ క్రమంలో తాసిల్దార్ కార్యాలయంలో ఏడు మంది రెవెన్యూ ఉద్యోగులకు పాజిటివ్ నిర్ధారణ కావడం ఈ ప్రాంతంలో ఆందోళన కలిగించింది ఒకరోజు వ్యవధిలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాజిటివ్ నమోదు కావడంతో కార్యాలయానికి సెలవు ప్రకటించడం జరిగింది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతారు అన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి సంఖ్య ఈ కాలంలో విరివిగా పెరిగింది. స్థానికులే కాక ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు సైతం క్రయ విక్రయాలు భారీగా జరపడంతో ఈ కార్యాలయ సముదాయాలు కరోనా బారిన పడ్డాయి అని స్థానికులు అంటున్నారు.

## అటవీ హక్కుల చట్ట ప్రకారమే పట్టాలు మంజూరు చేయాలి

**కొయ్యూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఏళ్ల తరబడి పోడు భూములను సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం పరిధి లో కుటుంబ అనికి 10ఎకరాల చొప్పున కొండపోడు భూమి పట్టాలను మంజూరు చేయాలని గిరిజన సంఘం నేత సరుముర్తి సూరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పలువురు రైతులు కలిసి కొయ్యూరు తహసీల్దారు శ్రీధర్ కు వినతిపత్రం అందించారు. సూరిబాబు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా సాగుచేస్తున్న గిరిజన రైతులు కు చట్ట పరంగా అటవీ హక్కులు చట్టం ప్రకారమే పట్టాలు కోరుతూ విన్నవించుకున్నా ప్రభుత్వం తత్సారం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు.అలాగె ఉపాదిహామి పథకం 200రోజులకు పెంచి,కూలి 600రూపాయలకు పెంచి,కరొనా భాదితులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో గెమ్మిలి. లక్ష్మణరావు, గెమ్మిలి కొండలరావు, ప్రభాకర్, సంపత్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో ఉపాధ్యాయుల నిరసన దీక్ష

**విశాఖ దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మధురానగర్ జీవీఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన దీక్షకు దిగారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ లక్షా 70 వేల మంది ఉపాధ్యాయుల జీవితాలతో ముడిపడిన అంశమని... సరిగ్గా 2004 సెప్టెంబరులో సీపీఎస్ తీసుకువచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కమిటీలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కూడా సీపీఎస్ రద్దు అంశాన్ని దాటవేశారని విమర్శించారు. సీపీఎస్ రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని రఘువర్మ స్పష్టం చేశారు.

## ప్రశాంతంగా జరుగుతున్న జేఈఈ మెయిన్స్



**నెల్లూరు సెప్టెంబర్ వార్తావళి 1:** జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, కొడవలూరు వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల, గూడూరు లోని ఆదిశంకర 1, 2 కేంద్రాల్లో పరీక్ష ప్రారంభమైంది. ఈసారి జిల్లా నుంచి ఐ.ఐ.టి, ఎన్.ఐ.టి. ప్రవేశాల కోసం జేఈఈ మెయిన్స్ ద్వారా 4,200 మంది తమ అదృ ష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కోవిడ్ – 19 మహమ్మారి నేపథ్యంలో ప్రతి ఒక్కరిని థర్మల్ స్కానింగ్ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోకి పంపారు అలాగే పరీక్ష కేంద్రాలను ఎప్పటి కప్పుడు శానిటైజేషన్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు జే.ఈ.ఈ మెయిన్స్ పరీక్ష జరిగే నాలుగు కేంద్రాల్లో పరిస్థితులను తెలుసుకున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు కూడా ఈ నాలుగు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుంది. ఈసారి అభ్యర్థులు మాస్కులు, గ్లోజ్‌లతో పరీక్ష రాస్తున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో శానిటైజర్ ను అందుబాటులో ఉంచారు.

## పెదబయలులో స్వచ్ఛంద బంద్ విజయవంతం

**పెదబయలు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** పెదబయలు మండల కేంద్రం లో వ్యాపార దుకాణాలు మూసి వేసి బంధు ను పాటి ంచారు. కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్న నేప థ్యంలో వ్యాపా రస్తులు స్వచ్ఛందంగా బందును పాటించారు.ఈ సంద ర్భంగా ఉదయం నుండి సాయంత్రం వరకు బందు నిర్వ హించారు .గత 5 నెలల నుండి పెదబయలు లో వారం సంత రోజు బందును పాటి స్తున్నారు .మిగిలిన రోజుల్లో ఉదయం 6 గంటల నుండి మధ్యా హ్నం ఒంటిగంట వరకు దుకాణాలు వ్యా పారస్తులు తీస్తున్నారు. పెదబయలులో వ్యాపారులు కరోనా నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నారు.

## పోలీసులు బాంబు స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు

**పెదబయలు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఏజెన్సీలో మావోయిస్టుల యాక్షన్ టీం తిరుగుతుందని సమాచారంతో పోలీసులు బాంబు స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేశారు .పెదబయలు మండలంలోనీ గంప రాయి నుండి పెదబయలు వరకు ఆర్ అండ్ బి రోడ్డు ప్రధాన రహదారులను తురకల వలస . గలగండ .ఈదుల పుట్టు. మంగ బంధ. చుట్టూ మెట్ట . ఆరడ కోట .బంగారుమెట్ట . పాన్ నీడ . ముసిరిపుట్టు .వరకు ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకొని ఉన్న వంతెనలను కల్వర్టును రోడ్డు గుంతలను ప్రధాన మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పోలీసులు బాంబు స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు .ఇటీవల భారీ వర్షాలు కురవడంతో మావోయిస్టులు ఆ సమయంలో మందుపాతరలు అమర్చే అవకాశం ఉందని అనుమానంతో పాటు మావోయిస్టు యాక్షన్ టీంలు సంచారం పై పెదబయలు ఎస్ ఐ పి .రాజారావు .ఆధ్వ ర్యంలో సి ఆర్ పి ఎఫ్ .ఏ పీ ఎస్ పి .పోలీసులు తనిఖీలు చేప ట్టారు. మారుమూల గ్రామాల నుండి వచ్చేవారు నుండి వివ రాలు అడిగి తెలుసుకున్నారు .మావోయిస్టుల కదలికలపై ఆరా తీస్తున్నారు. అనుమానితులను ప్రశ్నించి విడిచి పెడుతున్నారు

## కరోనాను జయించిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

**అయినవల్లి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** నిరంతరం ప్రజల కోసం ప్రజా సమస్యలపై పోరాడే శ్రమజీవి పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో మొత్తం కుటుంబ సభ్యులు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకు న్నారు. నెగిటివ్ రావడంతో కుటుంబ సభ్యులు కిమ్స్ ఆసుపత్రి నుండి వారందరూ పరిపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నా ఆరోగ్యం కోసం నియో జకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు ప్రార్థనలు నిర్వహించారని వారి సంకల్పం వల్లే పూర్తి ఆరోగ్యంతో తిరిగి ఇంటికి క్షేమంగా వచ్చానని ప్రజలు అభిమానులు చూపిన ప్రేమ ఆదరాభిమానాలను ఎప్పటికీ మరువలేమని ఆయన తెలిపారు. కరోనాను జయించి క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులకు నియోజకవర్గ అధికారులు, ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## కిర్లంపూడి ఎంపీడీవోకు ఉత్తమ సేవా పురస్కారం


**కిర్లంపూడి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఉత్తమ సేవలకు గాను స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకటించిన ఉత్తమ సేవా పురస్కారం సోమవారం ఎంపీడీవో డి. శ్రీ లలిత కు కాకినాడలోని జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి చేతుల మీదుగా సేకరించారు. ఈ సంద ర్భంగా మండల ప్రత్యేక అధికారి రత్న ప్రశాంతి, ఈ ఓపిఆర్ డి రమేష్ బాబు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు మరియు పలువురు ప్రజా ప్రతినిధులు ఆమెను అభినందించారు.

## ఆలమూరు తహశీల్దార్‌గా లక్ష్మీపతి

**ఆలమూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఆలమూరు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహశీల్దార్ గా జి లక్ష్మీపతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రెండు ఏళ్లపాటు ఆలమూరులో తహసీల్ధార్గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన జవ్వాది వెంకటేశ్వరి అమలాపురం డివిజనల్ రెవెన్యూ కార్యాలయానికి డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా బదిలీపై (16మండలాల తహశీల్దార్లకు అధికారిగా) వెళ్లగా, అమలాపురంలో కె ఆర్ ఆర్ సి లో తహశీల్దార్ గా పనిచేస్తున్న జి లక్ష్మీపతి ఆలమూరు మండలం తహసీల్దార్ గా బదిలీపై వచ్చారు. తాశీల్దార్ లక్ష్మీపతిని డిప్యూటీ తహశీల్దార్ పరిమళ, రెవెన్యూ అధికారి ఆర్ రామచంద్రమూర్తి, ఆర్ఐ జానకి రాఘవ, సర్వేయర్ ప్రభాకర్, పలువురు వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## సామాజిక తీర్పును ఆశావాదంతో ఎదుర్కొనేలా కోల్‌గేట్ అభియాన్

**జాతీయం, సెప్టెంబరు 2020:** భారతదేశాన్ని సదా చిరు నవ్వుతో ఉంచే దిశలో నోటి ఆరోగ్య సంరక్షణమే ముందంజలో ఉన్న కంపెనీ కాల్గేట్ పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ తన 'స్మైల్ కరో ఔర్ షురూ హెూ జావో' అభియాన్‌లో భాగంగా నూతన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఈ నూతన వాణిజ్య ప్రకటన చిత్రం ప్రజలను లాక్‌డౌన్ సమయాన్ని సరి కొత్తగా మూల్యాంకన చేసిన సమయం మరియు ఆశావాదంతో సవాళ్లతో కూడిన ప్రయాణాన్ని ప్రారంభించేందుకు స్ఫూర్తి నింపుతుంది. ఈ కథలో ఒక వృద్ధురాలు లాక్‌డౌన్ సమయంలో తీవ్రమైన ఒంటరితనంతో ఒక భాగస్వామికి చేరువ కావాలని చేసుకున్న తీర్మానంతో తన జీవితపు బాధ్యతను అర్థం చేసుకుంటుంది. ఈ వివరణ ద్వారా నిషేధాలు మరియు సామాజిక తీర్పుకు సంబంధించిన భయాలను అధిగమించే అనుభవాలను గురించి ఆమె వివరించడం ద్వారా లాక్‌డౌన్ అనంతరం ఆమె జీవితంలో నిర్ణయాత్మక క్షణాలకు తోడ్కొని వెళుతుంది. అందులో ఆమె నూతన ఆశావాదంతో సరికొత్త ప్రారంభాన్ని అక్కున చేర్చుకుంటారు మరియు ఆమె నూతన భాగస్వామిని తన కుటుంబం అలానే తనకు ఇష్టమైన వారికి నూతన విశ్వాసంతో పరిచయం చేస్తుంది. ఈ వాణిజ్య ప్రకటన చిత్రం ఉత్తమ భవిష్యత్తును సృష్టించేందుకు ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో కాల్గేట్ నిర్మించిన వరుస చిత్రాల్లో ఒకటి కాగా, ఇది స్మైల్ కరో షురూ హెూ జావో లేదా చిరునవ్వుతో ప్రారంభించండి అనే సందేశానికి అనుగుణంగా ఉంది. ఈ టీవీ వాణిజ్య ప్రకటన గురించి కాల్గేట్-పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ చింతామణి మాట్లాడుతూ "మహమ్మారితో అనిశ్చితి మరియు కష్ట సమయాన్ని అందరూ ఎదుర్కొనవలసి వచ్చింది మరియు ఇది ప్రజలకు వారి వ్యక్తిగత జీవిత ప్రయాణాన్ని ప్రతిబింబించేందుకు మరియు రీ వ్యాల్యువేషన్ చేసుకునేందుకు అవకాశాన్ని అందిస్తుంది. అటువంటి ఒక అవకాశం ఏమిటంటే సీనియరు సిటిజన్ల ఎదుర్కొనే ఒంటరితనం కాగా వారు తమ జీవితాన్ని కొత్తగా ప్రారంభించేందుకు మరియు భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలో సామాజిక తీర్పుకు భయపడి ఒంటరిగానే మిగిలిపోతారు. మా కథ దీప్తి నావల్ ద్వారా అద్భుతంగా వివరించగా, ప్రజలకు సకారాత్మకంగా ఆలోచించేందుకు మరియు సమాజం ఏమంటుందో అన్న వ్యాకులత నుంచి బయటకు చూసేందుకు మరియు తమ జీవితాన్ని పూర్తిగా వేడుకగా మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. మేము కాల్గేట్‌లో అటువంటి కథలను చెప్పడం ద్వారా భరోసా మరియు ధైర్యాన్ని నింపేందుకు అలానే ఉత్తమ భవిష్యత్తును మళ్లీ కల్పించుకునేందుకు మరియు స్మైల్ కరో ఔర్ షురూ హెూ జావోకు స్ఫూర్తి నింపేందుకు శ్రమిస్తున్నామని" వివరించారు. ఈ వాణిజ్య ప్రచార చిత్రాన్ని కాల్గేట్ ఇండియా డబ్ల్యుపిపి ఇంటిగ్రేటెడ్ పార్ట్‌నర్ రెడ్‌ఫ్యూస్ నిర్మించింది మరియు బాలీవుడ్ దర్శకుడు విక్రమాదిత్య మోత్వానె దర్శకత్వం వహించారు. మీరు ఈ వాణిజ్య ప్రచార చిత్రాన్ని హిందీ, మరాఠి, బెంగాలి, తమిళం మరియు తెలుగు భాషల్లో వీక్షించవచ్చు. ఈ క్యాంపెయిన్‌ను




ఇండియా టుడే గ్రూపులోని అన్ని ప్లాట్‌ఫారాలు, ఇతర టెలివిజన్ మరియు డిజిటల్ అలానే సామాజిక మాధ్యమాల ప్లాట్‌ఫారాలపై వీక్షించవచ్చు. ఈ క్యాంపెయిన్‌లోని వాణిజ్య చిత్రం రూపకల్పన వెనుక ఉన్న ఆలోచన గురించి రెడ్‌ఫ్యూజ్ ఎగ్జిక్యూటివ్ క్రియేటివ్ డైరెక్టర్ డెల్నాసెథ్నా మాట్లాడుతూ "మొదటి నుంచీ కాల్గేట్ వారి స్మైల్ కరో షురూ హెూ జావో క్యాంపెయిన్ విశ్వాసం మరియు ధైర్యంతో కూడిన కథలు తెరకెక్కిస్తూ వచ్చింది. ఈ నూతన వాణిజ్య చిత్రం మరో వివాహానికి సంబంధించిన విషయాన్ని కలిగి ఉండగా, ఇది భారతదేశంలో అందులోనూ ముఖ్యంగా మహిళలకు అత్యంత సూక్ష్మత కలిగిన విషయంగా ఉంది. ఈ నిషేధం గురించి మేము కమ్యూనికేషన్‌ను ఉత్తేజించాలని కోరుకుంటున్నాము మరియు భారతదేశంలో ఏ కారణానికి అయినా మహిళలు మరో వివాహాన్ని చేసుకోవాలనుకున్న సంస్కృతిని సహజ విషయంగా చేయాలని ప్రయత్నిస్తున్నాము. ఈ వాణిజ్య చిత్రం మొత్తం మీద ఆశావాదాన్ని ఉత్తేజించే లక్ష్యాన్ని మరియు తీర్పు భయాన్ని వీడి బయటకు చూడడం మరియు సకారాత్మక భవిష్యత్తు భరోసాతో ముందడుగు వేసేలా రూపొందించామని" తెలిపారు. స్మైల్ కరో ఔర్ షురూ హెూ జావో క్యాంపెయిన్ నిజ జీవితంలోని విశిష్ట కథలను ఆధారంగా చేసుకుని రూపొందిస్తుండగా అందులో 'లిస్ట్ ఎ' క్రికెట్‌లో ద్విశతకాన్ని సాధించిన యశస్వి జైస్వాల్, భారతదేశంలో దృష్టి సమస్య కలిగిన మొదటి సోలో ప్యారా గ్లైడింగ్ పైలెట్ దివ్యాంశు గనాత్రా మరియు భారతదేశంలో అనాథలకు తల్లిగా ఉన్న సింధు తాయి కథలు ఉన్నాయి. "స్మైల్ కరో ఔర్ షురూ హెూ జావో" క్యాంపెయిన్ మాత్రమే కాకుండా కాల్గేట్ తన కీప్ స్మైలింగ్ మిషన్‌లో భాగంగా ఆశావాదాన్ని విస్తరించడాన్ని కొనసాగించగా అందులో పలు సామాజిక కార్యక్రమాలైన బ్రైట్ స్మైల్స్, బ్రైట్ ఫ్యూచర్స్? ఓరల్ హెల్త్ మంత్, సేవ్ వాటర్ మరియు కీప్ ఇండియా స్మైలింగ్ ఫౌండేషనల్ స్కాలర్‌షిప్ తదితరాలు ఉన్నాయి. ఇటీవల ప్రారంభించిన విద్య, క్రీడలు మరియు సముదాయ కార్యక్రమాల్లో ఆర్థిక సహకారం మరియు మార్గదర్శనం అందించే కీప్ ఇండియా స్మైలింగ్ ఫౌండేషల్ స్కాలర్‌షిప్ 75,000 దరఖాస్తులను స్వీకరించింది.

# విశాఖ రూరల్

## అన్యాక్రాంతమై పోతున్న మున్సిపల్ స్థలాలకు రక్షణ కల్పించాలి

**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ప్రజా సంఘాల ప్రతినిధులు జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ శ్రీరామ్ మూర్తి తో మరియు, టౌన్ ప్లానింగ్ ఏ సి పి సంధ్య తో సమావేశమై టౌన్ ప్లానింగ్ లో జరుగుతున్న అవకతవకలపై ,మొద్దు నిద్రలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులు మేల్కోవాలి అని జీవీఎంసీ అధికారులకు సూచించడం జరిగిందని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్ తెలిపారు, ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడరావు మాట్లాడుతూ ,జివిఎంసి పరిధిలో మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం అయిపోతున్నాయి అని వెంటనే జివిఎంసి అధికారులు ఖాళీగా ఉన్న మునిసిపల్ స్థలాలకు బోర్డులు పెట్టాలని, అనకాపల్లి మెయిన్ రోడ్డు మీద షాపింగ్ మాల్స్ కి కనీసం పార్కింగ్ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని అన్నారు, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు మాట్లాడుతూ అనకాపల్లి లో మూడు అంతస్తులకు, ఇంటి ప్లాన్లు తీసుకుని ఐదు అంతస్తులు నిర్మిస్తున్న బడాబాబులు పై ఎందుకు చర్యలు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు ,మరోపక్క అనకాపల్లి అక్రమ లేఅవుట్లు కారణంగా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని ఎద్దేవా చేశారు, వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులు మొద్దునిద్ర వదలాలని జివిఎంసి కమిషనర్ శ్రీరామ్ మూర్తి కి ఏసీపీ సంధ్య కి ప్రజా సంఘాల ప్రతినిధులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది, దీనిపై స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారి ని సంధ్య మాట్లాడుతూ ప్రజా సంఘాలు వారు ఇచ్చిన ఫిర్యాదులో ఉన్న వాటిపై వెంటనే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు, అంతేకాకుండా అక్రమ లేఅవుట్లు వేసిన వారికి ,అనుమతి మీంచి నిర్మాణం చేపట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘం నాయకులు మట్ట కుమార్ ,అంబేద్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, ఎస్సీ సంఘం యువజన నాయకుడు అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## తొలి యేడు, జగన్ అన్న తోడు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** స్థానిక 83 వార్డు పరిధిగల వేల్పులవీధిలో స్థానిక శాసనసభ్యులు గుడివాడ అమర్నాథ్ ఆదేశాలమేరకు పట్టణ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకి రామ రాజు గారు మరియు పట్టణ యువజన విభాగ అధ్యక్షులు జాజుల రమేష్ గారి ప్రోత్సాహంతో సీఎం. జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రభుత్వం ముద్రించిన తొలియేడు జగన్ అన్న తోడు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉగ్గిన అప్పారావు వైస్సార్సీపీ ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిద్దలింగేశ్వర స్వామి మాజీ అధ్యక్షులు బోండాశంకర్రావు, ఏడవ వార్డు ఇంచార్జ్ జి. చిన్న. జగన్నాథ స్వామి డైరెక్టర్ కొంకి శ్రీరామ్ మూర్తి, కందికొండ సురేష్, ఎన్. మాణిక్యాలరావు, మొండి సాంబ,వార్డు వాలంటీర్స్, వైఎస్సార్సీపీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది

**ఇన్ చార్జ్ పీఒ ప్రవీణ్ ఆదిత్య**

**రంపచోడవరం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యారంగంలో మరింత నైపుణ్యాలు పెంచుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని ఐటిడిఎ ఇంచార్జ్ పి.ఓ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో కోవిడ్ -19 తర్వాత పాఠశాలల తెరచిన పిదప పిల్లల బడిని ఆకర్షించేందుకు ఎకడమిక్ ప్లానింగుపై విద్యాశాఖాధికారులుతో సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాక్టివ్ బేసిక్ టీచింగ్ మరియు లెర్నింగ్, బాల మిత్ర, సబ్జెక్టు మేళాల నిర్వహణ, శిక్షణలు నిర్వహణ, యోగా శిక్షణ, స్పోర్టుమీట్స్, మినియం న్యుమనికల్ నైపుణ్యాలు వంటి అంశాలపై దృష్టిసారించాలన్నారు భోదనలో విశ్లేషణాత్మకత అవసరమని, విషయం పూర్వాపరాలను సమగ్రంగా వివరించడంతో పాటుగా భావనను కూడా ప్రధానంగా తెలపాలన్నారు. ప్రాథమిక స్థాయినుంచి విశ్లేషణాత్మక భోదన అవసరమన్నారు. డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు శాస్త్రాన్ని కాకుండా విద్యార్థులను తొలుత ప్రేమించాలని తాను అడిగిన సందేహాలను చిన్నారి జీవితం నుంచి తీసుకొని వివరిస్తే వారిలో చదువుల పట్ల మరింతగా ఆసక్తి పెరుగుతుందన్నారు. వినూత్న భోధన ఉపాధాయుడి నుంచే పుట్టాలన్నారు. చివరి వరకు అక్షరం నేర్చుకోవడమే జ్ఞానానికి మూలమన్నారు. విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక దృక్పథాన్ని వెలికితీసి సృజనాత్మకతను పెంపొందించాలన్నారు. పిల్లల్లో ఒత్తిడి విడుదలకై యోగా, క్రీడా కార్యక్రమాలను నిర్వహిం చాలన్నారు. ఉపాధ్యాయులు ఆత్మీయతను పంచడం ద్వారా పిల్లలో స్పూర్తిని నింపి భావితరాలు గర్వించేలా వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. విద్యాభోదన నాణ్యతతో చేపట్టడంతో పాటు విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అందుకునేలా కేరీర్ గైడెన్సు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు విస్తృతస్థాయిలో చేపట్టాలన్నారు. పాఠ్యాంశాలతో పాటుగా ముందున్న జీవితాలను ఆత్మ ధైర్యం, నిండు విశ్వాసాలతో సాఫల్యం చేసుకునేటట్లు మార్గదర్శకత కల్పించాలన్నారు. విద్యావ్యవస్థలో బలంగా వేళ్లునుకున్న బట్టీ విధానానికి స్వస్తి పలికి విద్యార్థులకు అర్థమ య్యేరీతిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థుల ప్రమాణాల పెంపునకు ప్రవేశపెట్టిన ఫౌండేషన్ కోర్సులతోపాటు విద్యార్థుల ప్రవేశాల కొరకు లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రచించి అమలు చేయాలన్నారు. స్వీయ అభ్యసనకు ప్రాధాన్యత నివ్వాలని, పుస్తక పరిజ్ఞానంతోపాటు వాస్తవ పరిజ్ఞానాన్ని అలవర్చాలన్నారు. అత్యున్నతస్థాయి చదువుల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంచి వాటిని సాధించే దిశగా వారిలో ప్రేరణ కలిగించే నూతన కోర్సుల గురించి విశదీకరించాలన్నారు. ప్రతి వారం సమీక్షలు నిర్వహించి విద్యాప్రమాణాలు మెరుగుదల, ఆరోగ్యకర వాతావరణలో విద్యాభోదన ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా కొత్త విధానాన్ని అమలు పర్చడం ద్వారా ఒక ఏడాది కాలములో దాని ఫలితం సిద్ధిస్తుందన్నారు. వివిధ సబ్జెక్టులలో వున్న గ్యాపులను పూర్తించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఏవిధమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉపాధ్యాయులు అన్ని కోణాలలో పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని ఎటువంటి చెడ్డపేరు పాఠశాలకు రాకుండా ప్రదానోపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలన్నారు. మహిళా పోలీసులు ద్వారా స్వయం రక్షణ కొరకు బాలబాలికలు కిశోర భాలికలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వచ్ఛ భారత్, వనం-మనం, ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామవాలంటీర్లు సహకారంతో ఆశ్రమ పాఠశాలల్లో 5 వ తరగతి, ఇంటర్మీడియేట్ ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు అమ్మఒడి తదితర పథకాలు సమర్థవంతంగా అమలుచేస్తూ విద్యావ్యవస్థకు జవసత్వాలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిందన్నారు. ఈ కార్యక్ర మంలో డిడి ఎం.సరస్వతి, ఎటిడబ్ల్యులు, ఎంఇఒలు, ప్రదానోపా ధ్యా యులు ఎపిఆర్ఎస్ ప్రిన్సిపాళ్లు, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి దర్శనాలు పునఃప్రారంభం

### సహాయ కమిషనర్ అన్నపూర్ణ వెల్లడి

**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 1:** కరోనా కారణంగా ప్రభుత్వం లాక్ డౌన్ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో అనకాపల్లి నూకాంబిక అమ్మవారు దర్శనాలు నిలిపివేశామని ఆలయ కమిషనర్ అన్నపూర్ణ వెల్లడించారు. సెప్టెంబర్ రెండో తేదీ నుండి అనగా బుధవారం నుండి ఉదయం 6:00 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.



## సీజనల్ వ్యాధులు నుండి ప్రజలను కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ప్రస్తుతం వాతావరణం సీజనల్ వ్యాధులు ప్రభలెందుకు అనుకూలంగా ఉంది వర్షాలు కు కాలువలు గుంతలు లో నీరు నిల్వ ఉండి ప్రమాద కరమైన దోమలు వృద్ధి చెంది వాటి వలన విషజ్వరాలు అంటువ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నందున అధికారులు ముందు జాగ్రత్త చర్యలు నివారణ చర్యలు చేపట్టాలని, పారిశుధ్య పరిస్థితి మెరుగుకు సత్వర చర్యలు చేపట్టాలని ఎప్పటికి అప్పుడు మురికినీటి కాలువలు శుభ్రం చేయించడం, చెత్తకుప్పలు తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని పరిసరాల పరిశుభ్రత ,వ్యాధులు నివారణ మీద ప్రజలలో అవగాహన కలిగించే విధంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామీణ ప్రాంతములలో మెడికల్ క్యాంప్ లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని ,పారిశుధ్యకార్మికుల సంఖ్య పెంచి గ్రామీణ ప్రాంతములలో పారిశుధ్య పరిస్థితిని మెరుగుపరచి ప్రజలును సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడే చర్యలు వెంటనే చేపట్టాలని సూదికొండ మాణిక్యాలరావు అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ పార్టీ ఇంచార్జ్ అధికారులను కోరారు.

## పేద ప్రజలకు నిత్యావసరాలు పంపిణీ

**మాడుగుల, వార్తావళి, సెప్టెంబర్ 1 :**ఎంతోమంది మహా.. మహనీయులు రాజకీయాల్లో పదవులు సంపాధించి ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని హామీల వరాలజల్లు కురిపించే పరిస్థితి ఉన్న ఈ రోజుల్లో, ఎలాంటి పదవిలో లేకపోయిన ప్రజా సేవే లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా అడుగుల ముందుకు వేస్తూ ప్రజాధరణ పొందుతూ, అన్ని రంగాలకు చెందిన వారి నుంచి మన్ననలు పొందుతున్నాడు ఓ రైతు కుటుంబానికి చెందిన యువకుడు. ప్రజల పక్షానే మేమున్నాం వారికి ఏ కష్టం వచ్చిన వారి వెంటే మేముంటాం అంటూ ఎన్నో ప్రగడ్భాలు పలికిన రాజకీయనాయుకులు సైతం కరోనా మహమ్మారీకి భయపడి ఇళ్ళకే పరిమితమైన పరిస్థితుల్లో కూడా, వారికి అండగా నేనున్నానంటూ ప్రజలకు ధైర్యం చెపుతూ, ఏర్పడిన ఆర్థిక పరిస్థితులలో తన వంతు సహాయంగా సొంత నిధులతో పలు రకాల సేవా కార్యక్రమాలను శ్రీకారం చుట్టి నిరుపేద ప్రజల పక్షాన నిలిచి సభాష్ అనిపించుకున్నాడు. కరోనా వైరస్ నేపద్యంలో పలుకుబడిన నాయకులు, రాజకీయ నాయకులు



సైతం భయాందోళనతో ఇళ్లకే పరిమితమైన పరిస్థితుల్లో గుమ్మడి శ్రీరామ్ తన మానవత్వాన్ని చాటుకొనే దిశగా, మానవత దృక్పద కోణంలో ఆలోచన చేసి నాలుగు మండలాల్లో అనేక సేవలందించే కార్యమ్రానికి శ్రీకారం చుట్టారు. అలాగే నిత్యవసర సరుకులు కూరగాయలు, ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధిహామి కూలీలకు మజ్జిక ఫ్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ, అలాగే కరోనా మహమ్మారీ విజృంబిస్తున్న నేపద్యంలో ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ నేపధ్యంలో తన స్వగ్రామాని కూడా వెళ్ళకుండా కుటుంబ సభ్యులను సైతం పక్కనపెట్టి విధినిర్వాహణకే అంకితమైన పోలీసులు, పారిశద్య కార్మికులకు బోజన సదుపాయం, మాస్క్, శానిటేజర్స్ వంటివి అందించి శ్రీరామ్ సభాష్ అనిపించుకున్నారు. నిరుపేద కుటుంబంలో నుంచి వచ్చిన వ్యక్తి కావడం కారణంగా అన్ని సాదక బాదలు తెలిసి ఉన్నందునే కష్టకాలంలో పలు రకాల సేవలందించి ఆర్థికంగా ఆదుకున్నారని, ఆయన రాబోయే కాలంలో ఉన్నత శిఖరాలు అవరోధించాలని పలువురు ఆశిస్తున్నారు. కాగా గుమ్మడి శ్రీరామ్ మాట్లాడుతూ తనకు వచ్చే ఆధాయంలో తన అవసరాలకు పోగా మిగిలింది ప్రజలకు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నానని అన్నారు. ఎంత సంపాదన ఉన్న పేద ప్రజలకు సేవచేసే అదృష్టం ఉండాలని అన్నారు. అందరి ఆశీస్సులు ఉండాలని అన్నారు. రానున్న కాలంలో జనసేన నాయకుడు పవన్ కళ్యాన్ ఆశయానికి అనుగుణంగా పార్టీని బలోపేతం కృషి చేస్తామని అన్నారు.

## అధికార గర్వంతో పెచ్చుమీరుతున్నారు

### బిజెపి నాయకులు హెచ్చరిక

**కొయ్యూరు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** అధికార గర్వంతో ఎన్ని తప్పులు చేసినా ఊరు కోవాలా అవినీతిని బయట పెట్టామని ఎదురు దాడులు చేసి పులివెందుల మాదిరిగా మార్చి రాజకీయాలు చేస్తే ఊరుకొబొమని బిజెపి క్యాడర్ నాయకులు వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులను హెచ్చరించారు. అమాయక పేదప్రజల నుండి వైయస్సార్ విగ్రహాల ఏర్పాటు పేరుతో అక్రమ డబ్బులు వసూలు చేస్తూ పంచుకుంటున్నారని, ప్రభుత్వ పథకాలు పొందాలంటే విగ్రహం ఏర్పాటుకు తప్పనిసరి డబ్బులు ఇవ్వాల్సిందే ఇచ్చినట్లు ఎవరికీ తెలియ చేయరాదని డిమాండ్ చేస్తూ మండలంలో వైసిపి నాయకులు తీరును మండల బిజెపి అధ్యక్షుడు మురుకుర్తి అప్పలరాజు ఖండించారని సమాదానం చెప్పలేక ఆదివారం అతని దిష్టిబొమ్మ దగ్ధం చేయడంతో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకుల గాంధీ,అరకు పార్లమెంటు జిల్లా బిజెపి అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వర రావు వేరువేరుగా స్థానిక పోలీస్ స్టేషన్,మరియు నర్సీపట్నం ఏఎస్పీ కి ఫిర్యాదు చేసినట్టు విలేఖర్లకు తెలిపారు. అవినీతిని ప్రశ్నించిన మండల అధ్యక్షుడు అప్పలరాజుకు సమాదాణం ఇవ్వలేక దిష్టి బొమ్మను దగ్ధం చేసారని, దిష్టి బొమ్మ దహణం చేయడం నేరమని ఇందలో పాల్గొన్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు కు పిర్యాదు ఇచ్చినట్టు తెలిపారు. ఈవిషయంపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం సీరియస్‌గా తీసుకుంటుందని తెలి పారు. అలగే రాష్ట్రం అంతా అధికారగర్వంతో పులివెందల తల పించేవిదంగా వైసిపి కార్యకర్తలు పెచ్చుమీరుపోతున్నారని, రాష్ట్ర వైసిపి ప్రభుత్వం పరిపాలన చూసి ప్రజలు అసహ్యించుకొని,విసిగి పోతున్నరని,ఘాటుగావిమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 90 శాతం నిధులు జోడించి ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు పూర్తిగా ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి అమాయక ప్రజల నుండి డిమాండ్ చేసి వసూలు చేయడం ఎంతవరకు న్యాయమని,వైసిపి నాయకుల ఆగడాలను చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తూ బిజెపి నాయకులు వేరువేరుగా ప్రకటనల ద్వారా స్దానికవిలేకర్లుకు ఇచ్చారు. అలాగే మంప,రాజేంద్రపాలెం అల్లూరి స్మారక మందిరాల్లో 13 లక్షల నిధులు వెచ్చించి 15 మంది స్వాతంత్ర సమరయోధులు గ్రహాలు ఏర్పాటుకు సిద్దంగా ఉన్నామని బిజెపి నాయకులు వివరించారు. నాయకులు వేరువేరుగా ఇచ్చిన ప్రకటనల్లో పాల్గొన్న వారు కురసా రాజారావు,గాదె శ్రీనివాసరావు, కృష్ణారావు, చల్లా రామ కృష్ణ, బిజెపి మండలాధ్యక్షు మురుకుర్తి అప్పలరాజు,కూడా నూక రాజు,పెట్ల గాంధీ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

**మాకవరపాలెం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసిడిఎస్ కోటవురట్ల ప్రాజెక్టు సిడిపిఒ పి.అరుణకుమారి తెలిపారు. మాకవరపాలెం మండలంలోని గిడుతూరు, బూరుగుపాలెం-2, జి.వెంకటాపురం, ఎం.నగరం సెంటర్లకు అంగన్వాడీ వర్కరు పోస్టులు, దుంగలవానిపాలెం, మాకవరపాలెం-1 సెంటర్లకు హెల్పర్ పోస్టులు, రాజారాంపురం మినీ సెంటర్‌కు వర్కర్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత ఉన్న వారు ఈ నెల 10లోపు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసై, 35 ఏళ్ల లోపు వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## పెదబయలులో 5 కరోనా పాజిటివ్ కేసులు నమోదు

**పెదబయలు, వార్తావళి, సెప్టెంబర్ 1 :** మండలంలో మరో 5 పాజిటివ్ కరుణ కేసులు నిర్ధారణ అయినట్లు మండల ప్రజా పరి షత్ అధికారి (ఎంపీడీవో ) పూర్ణయ్య తెలిపారు .పెదబయలు ఐటిడిఎ రెంటల్ హౌసింగ్ కాలనీ లో నివాసముంటున్న ఇద్దరికీ. పోలీస్ స్టేషన్ లో ముగ్గురికి కరోనా వైరస్ వచ్చిందని తెలిపారు .ఐ టి డి ఎ రెంటల్ కాలనీలో ఇప్పటికే కంటోన్మెంట్ జోన్ గా ఉందని మరో రెండు కరోనా కేసులు నమోదు కావడంతో వీరి ప్రైమరీ సెకండ్ కాంటాక్ట్ గా గుర్తించినట్లు ఎంపీడీవో పూర్ణయ్య తెలిపారు .స్థానికులు భౌతిక దూరం పాటించాలని విధిగా మాస్కులు ధరించాలి అని వ్యక్తిగత శుభ్రత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో పూర్ణయ్య కోరారు.

## ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**రాజవొమ్మంగి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** మండలంలో సిపిఎస్ రద్దు కోసం ఎలక్షన్ ముందు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ రాష్ట్రానికి ముఖ్య మంత్రి అయిన వెంటనే నెల రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని రెండు సంవ త్సరాలు అయినా రద్దు చేయనందుకు రాజవొమ్మంగి మండలంలో ఉపాధ్యాయులు అందరూ రాజవొమ్మంగి ఎండిఓ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ నాయ కులు, అధ్యక్షులు ఉదయ్, ప్రధాన కార్యదర్శి ఎస్ రాజ బాబు, కోశాధికారి పి.రమణ, ఎం.రమేష్ బాబు, ఈ బాపూజీ, బి వెంకటలక్ష్మి, నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పచ్చని ప్రకృతీ నీకు వందనం: ఆర్ ఎస్ ఎస్ సభ్యులు

**పిఠాపురం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** పిఠాపురంలో ఆర్ ఎస్ ఎస్ పిలుపు మేరకు ప్రకృతి వందనం కార్యక్రమం స్థానిక శ్రీ సూర్యరాయా గ్రంధాలయం వద్ద చెట్టును పూజించి మేము మీకు రక్ష మీరు మాకు రక్ష అంటూ రక్షలు కట్టి ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేసి హారతి ఇచ్చి ఆ చెట్టుకి మ్రొక్కటం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ ఎస్ ఎస్ జిల్లా కార్యదర్శి సత్య రామచంద్రా మాట్లాడుతూ ప్రకృతిపై మనం ఆధారపడి ఉన్నాము. దానిని ఆరాధించ లేకపోవటం వల్లనే నేడు కరోనా వైరస్,వరదలు మొదలగు విపత్తులతో ప్రకృతి విలయ తాండవం చేస్తుంది. వీటినుండి మనం రక్షించబడాలి అంటే ప్రతీ ఒక్కరూ ప్రకృతిని కాపాడవలసిన అవసరం చాలా ఉంది.

## ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నిర్వీర్యానికి వైసీపీ పన్నాగం

### ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు విమర్శ

**అనకాపల్లిటౌన్, వార్తావళి, సెప్టెంబర్ 1 :** భారతదే శంలోనే ఖ్యాతిగాంచిన చెరకు పరిశోధనా స్థానాలలో ఒకటిగా నిలిచిన అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని నిర్వీర్యం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం, స్థానిక నేతలు ప్రయత్నిస్తున్నారని తేదేపా ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు విమర్శించారు. ఈ మేరకు స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు పది దశాబ్దాలు పైబడి ఈ పరిశోధనా స్థానం వ్యవసాయ రంగానికి విశిష్ట సేవలు అందిస్తోందని తెలిపారు. కాగా 103ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వ్యవసాయ పరిశోధనా స్థానానికి స్థానిక లక్ష్మీదేవిపేటకు చెందిన రైతులు అప్పట్లో ఈ సంస్థకు భూములు ఇచ్చారని పేర్కొన్నారు. కాగా చెరకులో తెగుళ్లను తట్టుకునే ఎన్నో ఉత్తమ వంగడాలను ఇక్కడి శాస్త్రవేత్తలు రూపొందించి రైతులకు అందించారన్నారు. వ్యవసాయ రైతులకు తలమానికంగా ఈ పరిశోధనా స్థానం నిలిచిందన్నారు. ఇదిలా ఉండగా రైతులకు సేవలందిస్తున్న ఈ పరిశోధనా స్థానంలోని 30 ఎకరాల్లో ప్రభుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నించటం అనాలోచిత చర్య అని ఎమ్మెల్సీ బుద్ధ విమర్శించారు. ఈ సమావేశంలో తేదేపా సీనియర్ సీనియర్ నేతలు కొణతాల వెంకటరావు, ధనాల విష్ణుచౌదరి పాల్గొన్నారు.

## గట్టుపై సాగు - ఆదాయం బాగు

**రాజవొమ్మంగి, వార్తావళి, సెప్టెంబర్ 1 :**మండలంలో మెట్ట ప్రాంతంలో వ్యవ సా యం సాగుచేస్తున్న రైతులు తమ పొలాల్లో పక్కన ఖాళీగా ఉండే స్థలం లోనూ, గట్లపైన, రోడ్డుపక్కలా, పలు రకాల మొక్కలు పెం చుతూ అదనపు ఆదాయం చేస్తున్నారు. సాధారణంగా గట్లను ఖాళీగా ఉండే గట్టి శుభ్రం చేయక పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి పోయి అ పరిశుభ్రంగా పరిసరాల శుభ్రత లేక పంటలపై చీడపీడలు ఆశించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితులు రాకుండా మండలపరిధిలో వట్టి గడ్డ, సింగంపల్లి తదితర గ్రామాలలో నల్లరేగడి నేల వ్యవసాయం చేసే రైతులు పొలాల వెంబడి ఇరువైపుల గట్లపైన, ఖాళీ స్థలాలలో కంది, మినుములు, అరటి, మిరప, బెండ తదితర మొక్కలను పెంచుతున్నా మొక్కలకు ఎటువంటి ఎరువులు, రసాయనాలు వేయకుండానే ఏపుగా పెరుగుతున్నాయి. తమ పంట పొలాలకు నీరు పెట్టిన ఈ మొక్క లకు కూడా తడిని అందిస్తూ ఇలా ఖాళీ ప్రదేశాలను వదిలే యకుండా పలురకాల మొక్కలను పెంచడం ద్వారా కుటుంబ అవస రాలు తీర్చడం తోపాటు చిరు వ్యాపారులకు విక్రయించి అద నపు ఆదాయం పొందుతున్నారు. పొలాల పరిసరాలు శుభ్రంగా ఉంటే పంటలకు తెగుళ్లు బెడద తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

## యూరియాపై అధికారులు నిర్లక్ష్యం రైతులు ఆందోళన

**దేవరాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** మండలకేంద్రమైన దేవరాపల్లి పి ఏ సి ఎస్ పరిధిలో యూరియా కోసం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 వరకు సోమవారం రైతులు పడిగాపులు కాశారు. యూరియా ఇవ్వక పోవడంతో రైతులు ఆందోళన చెందారు. పలు గ్రామాల కుంతమంది రైతులు దీనికారణంగా గాయపడ్డారు. స్థానిక ఎస్సై పి. నరసింహామూర్తి తమ పోలీస్ సిబ్బందితో ఆందోళన కారులను చెదరగొట్టారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగా యూరియా కోసం రైతులు ఆందోళన చెందవలిసి వచ్చిందని దీనివల్ల పలు గ్రామాల రైతులకు గాయాలపాలయ్యాయని రెడ్డి సూరిబాబు, అధిరెడ్డి శ్రీను, దేముడు తదితర రైతులు మంగళవారం తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సరిపడా యూరియా ఇవ్వాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# విశాఖపట్నం



అరకు వేలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా సోమెలి సన్యాసిరావు ను నియమించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మరియు అరకు పార్లమెంట్ డిస్టిక్ ఇన్చార్జి పాచి పెంట శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

– వార్తావళి, అరకు

## కాస్త దయ చూపండి సారూ..



**అగనంపూడి, వార్తావళి, సెప్టెంబర్ 1:** జీవీఎంసీ 56 వార్డు ఏడుమెట్ల- ఆగనంపూడి జాతీయ రహదారిపై గల వంతెన పై గత కొన్ని నెలలుగా ఒక గుర్తు తెలియని ఒక అభాగ్యుడు జీవచ్ఛంల పడి ఉన్నాడు..రెండు మూడు నెలలుగా భారీ వర్షాలు కురుస్తున్న,ఎండలు కాస్తున్న ఎటువంటి చలనం లేకుండా అక్కడే దుర్భాలమైన జీవితం గడుపుతున్నాడు..మొన్న ఆదివారం కూడా భోజనం పార్సిల్, వాటర్ ప్యాకెట్లు ఇచ్చిన ఎలాంటి ప్రతిస్పందన లేదు..వంతనపై రాకపోకలు సాగిస్తున్న కొంత మంది వాహనదారులు, ప్రయాణికులు ఎవరుకు తోచింది వాళ్ళు సహాయం చేస్తున్నారు.. లిఈ మధ్య ఎవరో ఒక ప్రయాణికుడు అతని దినావస్థను చూసి చలించి ఒక పెద్ద ఫ్రిజ్ అట్ట పెట్టెను కప్పి వెళ్లిపోయారు..లి అప్పుడప్పుడు ఇలాంటి సహాయం చేస్తున్న వాళ్ళ వల్ల ఇంకా మానవత్వం కాస్తో కూస్తో ఉందన్న నమ్మకం కలుగుతుంది..కొందరు ప్రయాణికులు అయితే చలించి కంటతడి పెట్టడం కొసమెరుపు.. కావున లిజీవీఎంసీ జోనల్ కమిషనర్ శ్రీ శ్రీధర్ గారు,దువ్వాడా సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీమతి లక్ష్మీ గారు మానవతా దృక్పథంతో స్పందించి ఈ అపస్మారక స్థితిలో ఉన్న సదరు వ్యక్తిని సంరక్షణ కేంద్రానికి లేదా ఆస్పత్రికి తరలించవలసిందిగా నిత్యం రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు కోరుచున్నారు.. కావున తమరు స్పందించి మానవత్వంతో కాపాడి ఇంకా ఈ సమాజంలో మానవవత్వం బ్రతికే ఉంది చాటి చెప్పాలని చుట్టుపక్కల గ్రామస్తులు కోరుచున్నారు.

## నాగవంశీయుల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**భీమునిపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** నాగవంశీయుల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసు కోవాలని నాగవంశం సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షు లు గాడు శ్రీను కోరారు. ఈ వి ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గతంలో తన ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా తమ కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఇచ్చే అంశాన్ని పొందుపరిచినట్లు మంత్రికి తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి తక్షణమే ఆ వినతి పత్రంను సీఎం ఓ కార్యాలయానికి మైలు ద్వారా పంపించారని వారు పేర్కొన్నారు. అంతేగాకుండా నాగవంశీయుల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ వచ్చే దిశగా తన వంతుగా తీవ్ర ప్రయత్నం చేస్తానని మంత్రి ముత్తంశెట్టి హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు.ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం ఉపాధ్య క్షుడు కంటుబోతు రాంబాబు, మొకర అప్పల నాయుడు, కె.పి స త్యన్నారాయణ, బోని అప్పలనాయుడు. కె.పద్మనాభం, కంటుభుక్త ముత్యాల నాయుడు,రాంభుక్త ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఎన్నికల వాగ్దానాలు అమలుచేయాలి

### ఎపి మహిళాసమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ విమల

**పెందుర్తి, వార్తావళి, సెప్టెంబర్ 1:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన ఎన్నో హామీలను అమలుచేయడంలో వైఫల్యం చెందిందని ఎ పి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ విమల విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పెందుర్తి మండలం చిన్నముసిడివాడ సమీపానగల సప్త గిరి నగర్ సచివాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ ముఖ్యంగా వృద్దులు, వితంతువులు, ఇతర పెన్షన్‌లు 2000రు. నుండి 3000 రూ.లకు పెంచుతామని చెప్పి,అది కూడా విడతలు విడతలుగా ప్రతి సంవత్సరం 250 రూ.పెంచుతూ నాలుగేళ్ల లో 3000 వేలు ఇస్తామని చెప్పి 2019 జూలై నుండి 2250 రూ.ఇస్తున్నారని,నాటి హామీలో భాగంగా మళ్లీ 2020 జూలై నుండి 250రు పెంచి 2500



రు.ఇవ్వాల్సి ఉండగా నేటికీ మూడు మాసాలు గడుస్తున్నా, ఈ సంవత్సరం పెంచి ఇవ్వాల్సిన డబ్బులు ఇంతవరకూ ఇవ్వలేదన్నారు.పెన్షన్ మీద ఆధారపడ్డ అవ్వ,తాత లు భర్తలు లేని సోదరీ మణులు పెంచి ఇస్తామన్నపెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు.కరోనా విపత్కర పరిస్థితుల్లో పౌష్టిక ఆహారం మరియు ఆరోగ్యం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచి ఇస్తానన్న పెన్షన్ ను,వెంటనే లబ్దిదారులకు చెల్లించాలని విమల డిమాండ్ చేశారు.

## సి.పి.ఎస్ రద్దు తథ్యం

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** సి.పి.ఎస్ రద్దు...ఓ.పి.ఎస్ పునరుద్ధరణ పై మంగళవారం భోజన విరామ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యర్యం విశాఖ కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రజా రవాణా శాఖ, వై.ఎస్.ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.వి.వి.సత్యనారాయణ, జి.పి.రావు, జిల్లా నాయకులు ఎస్.వి.రావు తదితరులు పాల్గొన్నారు. కోవిద్ 19 నిబంధనలు ప్రకారం



జరిగిన కార్యక్రమంలో జి.పి.రావు మాట్లాడుతూ గత ప్రభ్యత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొనేవారని జగన్ మోహన్ రెడ్డి గారు పాదయాత్ర ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ లో పనిచేస్తున్న ఉద్యోగులను 01-01-2020 న ప్రభ్యత్వము లో విలీనం చేయుడం జరిగిందిని చెప్పారు. అలాగే సి.పి.ఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, తప్పకుండా రద్దు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎ.పి.జి.ఈ.ఎ జిల్లా అధ్యక్షులు పి.చంద్రర్ రావు, కార్యదర్శి రమణ పాటు రాష్ట్ర నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రశేన గుప్తా జన్మదిన వేడుక

**పెందుర్తి, వార్తావళి, సెప్టెంబర్ 1 :** వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కీ.శే. కల్వకుంట్ల చంద్రశేన గుప్తా జన్మదినం సందర్భంగా మంగళవారం వాసవీ క్లబ్స్ సుజాతా నగర్ , మహా సుజాతా నగర్ సభ్యులు సుజాతా నగర్ దరి హరిహర క్షేత్రం నందలి శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్, సుజాతా నగర్ డైరెక్టర్ వాసవి యన్ సిల్వర్ స్టార్ కే.సి.జి.ఎఫ్. పెంటపాటి వెంకట రాజు దుస్సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గ్రంధి దేముల్లు, కోశాధికారి పల్లంటి శ్రీరామ మూర్తి, జోన్ ఛైర్పర్సన్ వాసవి యన్ సుగ్గు నరసింగరావు, డైరెక్టర్ పెంటపాయి వెంకట రాజు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## ఏరులై పారుతున్న నాటు సారా

**మునగపాక, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ఊరూరా లక్ష్యంగా నాటు సారా ఏరులై పారుతోంది. లాక్‌డౌన్ నే పథ్యంలో మద్యం షాపులు మూత కాలంలో అక్రమ వ్యాపా రులు వేసిన నాటు సారా బీజం నేడు మహావృక్షంగా విస్తరిస్తోం ది. మొన్నటి వరకు కేవలం ఒక టి, రెండు చాటు-మాటు గ్రామాలకే పరిమితంగా ఉన్న నా టు సారా తయారీ ఇప్పుడు మం డలంలో ప్రతి గ్రామానికి పాకింది. అధికార యంత్రాంగం అందుబా టులో ఉన్న మండల కేంద్రమైన మునగపాకలో సైతం పలు ప్రాంతాల్లో నాటు సరా తయారీ మూడు పువ్వులు, ఆరు కాయలు మాదిరిగా తయారవుతోంది. అనకాపల్లి ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఇటీవల కాలంలో విస్తృత పర్యటనలు జరిపి నాటు సారా తయారీ, విక్రయ స్థావరాలుపై దాడులు జరిపినా యథేచ్ఛగా కొనసా గుతూనే ఉండటం విశేషం. మద్యం ధరలు అధికంగా పెరగడంతో కూలి, నాలి చేసుకునే నిరుపేద కూలీలు, మధ్య తరగతికి చెందిన మద్యం ప్రియులు కూడా నాటు సారాకు బాగా అలవాటు పడుతు న్నారు. రైతుల కల్లాలు, పంట పొలాలు మధ్య నాటు సారా తయారీ జోరుగా జరుగుతోంది. సారా సేవించే వారు సంఖ్య రోజురోజుకు పెరగడంతో అక్రమ తయారీ దారులు నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు వదిలి ఇష్టారాజ్యంగా వంటకాలు సాగిస్తున్నారు. దీని ప్రభావం సారా సేవించే వారి ఆరోగ్యంపై తీవ్రంగా పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అవసరమైతే ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన వారి సహాయం కూడా తీసుకొని పలు బృందాలుగా తనిఖీలు ముమ్మరం చేయడం ద్వారా అక్రమ నాటు సారా తయారీ దారుల భరతం పట్టవచ్చునని చెబుతున్నారు. సారా తయారీ సమ్మూళనంగా నిరోధించడానికి ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర శాఖలు ఏ విధంగా చర్యలు చేపడతాయో వేచి చూడాల్సిందే. నిలువరించడం సాధ్యం కాకపోతే ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా చెబుతున్న దశల వారీగా పూర్తి స్థాయి మద్యం నిషేదం సమయానికి నాటు సారా స్థావరాలు అసాధారణ స్థాయిలో బలోపేతం కావడం ఖాయమని పలువురు చెబుతున్నారు.

## ప్రణబ్‌కు ఘన నివాళులు

**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, సెప్టెంబర్ 1:** భారతదేశ 13వ రాష్ట్రపతి,భారతదేశ రాజకీయచరిత్రలో సుమారు అర్థశతాబ్దం పాటు రాజకీయాల్లో అపర చాణిక్యుడుగా పేరుగాంచిన అపరమేధావి స్వర్గీయ శ్రీ ప్రణబ్ ముఖర్జీ అని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రకాంగ్రెస్ మహిళాఅధ్యక్షురాలు పేడాడ రమణికుమారి అన్నారు.ఈ రోజు నగర కాంగ్రెస్పార్టీ కార్యాలయంలో ప్రణబ్ ముఖర్జీ చిత్రపటానికి పూలమా



లలు వేసి ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో కేంద్రమంత్రిగా సుదీర్ఘసేవలందించారని కొనియాడారు. ఇందిరాగాంధీ అనుచరుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. రాష్ట్రపతిగా అత్యున్నతస్థానాన్ని అధిరోహించి సామాన్యునికి రాష్ట్రపతి భవనాన్ని దగ్గరచేశారని కొనియాడారు. తన రాజకీయ ప్రస్థానంలో పార్టీలకతీతంగాఎన్నో ఉన్నత స్థానాలను అధిరోహించిన ప్రణబ్ మరణవార్త కలిచివేసిందని రమణి కుమారి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు ఈ కార్యక్రమంలో సింకా, సుధాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణబ్ ముఖర్జీ మరణం దేశానికి తీరని లోటు

### సంకు వెంకటేశ్వరరావు

**విశాఖపట్నం, తూర్పు, వార్తావళి, సెప్టెంబర్ 1:** ఎంతో శ్రమ, పట్టుదల, క్రమశిక్షణతో దేశ రాజ్యాంగ ఉన్నతపదవిని చేపట్టిన ప్రణబ్ ముఖర్జీ మరణం దేశానికీ తీరని లోటని విశాఖపట్నం కాంగ్రెస్ నగర అధ్యక్షుడు సంకు వెంకటేశ్వర రావు అన్నారు. దేశ రాజకీయాలలో చెరగని ముద్ర ప్రణబ్ అని కొనియాడారు.రాజకీయ వర్గాలనుంచే కాకుండా, సామాన్య ప్రజల నుంచి సైతం మెప్పుపొందిన గొప్ప రాజనీతిజ్ఞుడన్నారు.అయన ప్రాణాలు కాపాడడానికి వైద్యులు చేసిన కృషి ఫలించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దేశం ఓ ముద్దు బిడ్డను, గొప్ప మార్గర్శకుడిని కోల్పోయిందన్నారు. ప్రణబ్ ముఖర్జీ కుటుంబసభ్యులకు సంకు వెంకటేశ్వర రావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## దళితులపై దాడులు అరికట్టాలి

**మల్కాపురం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** విశాఖ పచ్చిమ నియోజకవర్గ పరిధిలోని మల్కాపురం జంక్షన్లో రాష్ట్ర సమితి పిలుపు మేరకు దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిం చారు. నగర కార్యదర్శి గుడాల రాంబాబు మాట్లాడుతూ గత కొన్నా ళ్లుగా దళితులు పై దాడులు పెరుగుతూన్నాయి అని దళితులు అంటే అంత చులకనా భావం ఎందుకు ఇంతకు ముందు మహిళల పై హత్య చారాలు ఇప్పుడు శిరోమండనం ఇది ప్రజాస్వామ్యం దళితులకు అడిగే హక్కు లేదా బాధితునికి 100 గజాలు ఇంటి స్థలం ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. యి కార్య క్రమంలో చింతాల అప్పారావు,మోహన్,వై కనకరాజు, అప్పలస్వామి, రామకృష్ణ, రాము, సూరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

## చిట్టివలస జ్యూట్ మిల్ కాంగ్రెస్ కార్మిక నాయకులు ఎన్నిక


**తగరపువలస, వార్తావళి, సెప్టెంబర్ 1 :** చిట్టివలస జ్యూట్ మిల్ కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు ఎన్నిక; స్థానిక కార్యాలయంలో నిర్వహించా రు. కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షులు గా జీరు వెంకట కైలాష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చిల్ల ఆదినారాయణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ గా చిల్ల కాశీవిశ్వనాథ రెడ్డి లను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జీరు వెంకట కైలాష్ రెడ్డి మాట్లాడుతూ నాకు అధ్యక్ష పదవి మీద ఆసక్తి లేదనీ కార్మికుల బాధలు చూసి నామనసు చలించిపోయినట్లు చెప్పారు. నేను కూడా కార్మికుని కుమారుడేననీ అన్నారు. కార్మికులు నెల జీతం కోసం ఎంతో తహతహ లాడుతూ పనిచేసేవారనీ,అలాంటి ది 11ఏళ్ళుగా జ్యూట్ మిల్ మూతపడి నానా; తంటాలు పడుతున్నారనీ ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాసరావు యాజమాన్యం ను రప్పించి కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికులకు రావలసిన బకాయిలను ఇప్పిస్తానని చెప్పారు. త్వరలో కాంగ్రెస్ కార్మిక సంఘం తరపున అన్ని సంఘాలతో కూర్చుని పి.ఎఫ్ గురించి చర్చించనున్నట్లు చెప్పారు. వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి మాట్లాడుతూ కార్మిక సంఘం తరపున కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామనీ తెలిపారు. ఈ కార్యక్ర మంలో జనరల్ సెక్రటరీ మునకాల ఆదినారాయణరెడ్డి, ఆఫీస్ బేరర్స్ ఎస్. ఈశ్వర్రావు,గొలగాని రాము, వైవి రెడ్డి లు వారిని అభినందించారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా సంబరాలకు సిద్ధం

**సబ్బవరం, వార్తావళి, సెప్టెంబర్ 1 :** ప్రముఖ సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సెప్టెంబర్ 2న పురస్కరించు కొని ఆయన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు సంబరాలు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని గోటివాడ గ్రామంలో ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు మంగళవారం తరు ణ్‌కు మార్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఆ రోజు గోటివాడ గ్రామంలో లో జనసేన అధినేత మరియు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పేరుతో ప్రత్యేకంగా తయారు చేయించిన కేకు కట్ చేస్తామని జనసేన నాయకుడు ఈరోతి తరుణ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా ఈ సారి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను ప్రతీ గ్రామాల్లో అభిమానులు ఘనంగా జరుపుతారని ఆయన తెలిపారు. కావున అభిమానులు పార్టీ నాయకులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా తరుణ్ కుమార్ కోరారు. కాగా గోటివాడ గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు ఈ. తరుణ్ కుమార్ పవన్ కళ్యాణ్ పై ఉన్న అమితమైన అభిమానం ప్రేమతో లాక్ డౌన్ సమయం లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో నిత్యం అనేక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను విశేషంగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈ తరుణ్ కుమార్ తో పాటు గోటివాడ కు చెందిన నాయకులు కె. ఉమా మహేష్, పి. అశోక్,ఎమ్. భాస్కరరావు,జి. రవి, ఎల్. అప్పలరాజు, బి.అప్పలరాజు, ఎన్.అచ్యుతరావు, ఎల్. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# బీమారంగంలో దిగ్గజ సంస్థగా పేరు గాంచిన ఎల్ఐసి

**విశాఖపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 1 :**బీమా రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భారతీయ జీవిత బీమా సంస్థ నేడు 65వ సంవత్సరంలో అడుగిడింది. 1 సెప్టెంబర్ 1956లో జాతీయం కాబడి అంచెలంచెలుగా ఎదిగి బీమారంగంలో దిగ్గజ సంస్థగా పేరు గాంచింది. 28.92 కోట్ల వ్యక్తిగత పాలసీలు, 11.36 కోట్ల సమూహ (గ్రూప్) పాలసీలతో మొత్తంగా 40కోట్ల పై చిలుకు పాలసీదార్లకు సేవలందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో పాలసీలలో 75.9%, మొదటి ప్రీమియంలో 68.74% మార్కెట్ వాటాని కలిగి ఉంది. డెత్ క్లెయిమ్స్ ని పరిష్కరించడంలో ముందు పీఠిన నిలుస్తోంది. నేటి కరోనా మహమ్మారి విలయతాండవం లో అసువులు బాసిన వారందరికీ ఇప్పటికే చెల్లింపులు జరిగాయి.డెత్ క్లెయిమ్స్ చెల్లింపుల్లో నామినీదార్లకు వారు సమర్పించవలసిన ప్రమాణ పత్రాలను 'మెయిల్' లో పంపినా, అనుమతించి పరిష్కారం చేయడం జరిగింది. అలాగే మెచ్యూరిటీ మరియు మనీ బ్యాక్ చెల్లింపుల్లో కూడా కొన్ని షరతులకు లోబడి ఆధార పత్రాలు తక్షణం సమర్పించక పోయినా, చెల్లింపులు చేసేం అని విశాఖపట్నం డివిజన్ సీనియర్‌లి లిడివిజనల్ మేనేజర్ శ్రీ లక్ష్మీకాంత్ పట్నాయక్‌లి తెలియజేసేరు. కోవిడ్19 సందర్భంలో ప్రీమియాన్ని డిజిటల్ చెల్లింపుల్లో చేసే విధంగా సంస్థ చర్యలు తీసుకుంది. 2019-20 సంవత్సరానికి గాను, ?1,59,770 కోట్ల రూపాయలను క్లైమ్స్ రూపంలో చెల్లించింది. జాతికి పునరంకితమవుతూ, 24 లక్షల కోట్ల రూపాయలు దేశాభివృద్ధికై ఖర్చు చేయడం జరిగింది. ప్రజల సొమ్ము ప్రజల సంక్షేమం కోసమే అన్న నినాదాన్ని నిజం చేసినట్లయింది. 2019-20 సంవత్సరానికి గాను ? 2,610 కోట్ల రూపాయలను ప్రభుత్వానికి డివిడెండ్‌గా చెల్లించడం జరిగింది. ప్రీమియం చెల్లించడంలో పట్టదార్ల సౌకర్యార్థం కొన్ని బ్రాంచిల్లో మెషీన్ లను కూడా ప్రవేశపెట్టడం జరిగింది. ఎంపిక చేసిన కొన్ని బాంక్ శాఖల్లో కూడా ప్రీమియం చెల్లించుకునేలా బ్యాంకు, సిటీ యూనియన్ బాంక్ మరియు



ఆక్సిస్ బ్యాంక్ ల తోను ఒప్పందం కుదుర్చుకుంది. నేటి తరానికి మరింత చేరువ కావడం కోసం లిఈ టర్మ్‌లి పాలసీలను, పెన్షన్ పాలసీలను మరీ ముఖ్యంగా కేన్సర్ బాధితుల కోసమని లికేన్సర్ కవర్‌లి పాలసీని ప్రవేశ పెట్టింది. ప్రధానమంత్రి వయవ్యందన పెన్షన్ ప్లాన్ కూడా ఆన్లైన్లో వయో వృద్ధుల కోసం లభిస్తుంది. తక్కువ ప్రీమియంతో చిన్న చిన్న చేతి వృత్తుల వారికి, డైలీ వర్కర్స్ కోసం కూడా లిమైక్రో ఇన్సూరెన్స్‌లి ద్వారా నిమ్న వృత్తుల వారికి బీమా సౌకర్యం కల్పిస్తోంది. న్యూ మొబైల్ ఆప్‌లి అని ఒక ఆప్ ని అభివృద్ధి పరిచి, ఆ ఆప్ ద్వారా అనేక సేవలు పొందే విధంగా చర్యలు తీసుకుంది. 20 బ్రాంచిలతో, 14 ఆఫీస్‌లతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో విస్తరించిన విశాఖపట్నం డివిజన్ కూడా ఇతోధికంగా సేవలందిస్తూ పాలసీదారుల ఆదరణ పొందుతోంది. గత ఆర్థిక సంవత్సరం లో 2,82,352 పాలసీలతో, విశాఖపట్నం డివిజన్ చరిత్రలో కెల్లా రికార్డ్ స్థాయిలో ?403.56 కోట్ల మొదటి ప్రీమియం సేకరించి దక్షిణ మధ్య జోన్లో పాలసీల పరంగా లినెంబర్ 1లి స్థానాన్ని ఆక్రమించింది.మొదటి ప్రీమియం లో ద్వితీయ స్థానంలో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటికి 66000 పాలసీలు, ?182 కోట్ల మొదటి ప్రీమియం సమీకరించి సౌత్ సెంట్రల్ జోన్లో మొదట స్థానాన నిలిచింది. వైజాగ్ డివిజన్ మెరుగైన సేవలు, త్వరితగతిన తీసుకోవడానికి మేం కంకణ బద్ధులమై ఉన్నామని శ్రీ పట్నాయక్ గారు తెలిపారు. గోల్డెన్ జూబిలీ ఫౌండేషన్ ద్వారా మన డివిజన్ పరిధిలో, గజపతినగరం లో ఉన్న లిగ్లోబల్ ఎయిడ్‌లి సంస్థ కు ఒక లిఅంబులెన్స్‌లి ని, వైజాగ్ లోనే ఉన్న నేత్ర విద్యాలయ? కు ఒక స్కూల్ బస్ వితరణ చేయడం జరిగింది. ఈ సంవత్సరం కూడా హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్‌కు ఎలక్ట్రిక్ వాహనం ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇలాగే అనేక కార్యక్రమాలతో, పట్టదారుల సేవకు విశాఖపట్నం డివిజన్ జాతి సేవలో పునరంకితమవుతుం దని వార్షికోత్సవ సందర్భంగా పట్నాయక్ తెలిపారు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006